thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 209 | జగిత్యాల గురువారం 12 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ఇషా బృందానికి స్వర్ణం



11

హైడ్రా కమిషనర్, శంషాబాద్ తహసీల్దార్‌కు హైకోర్టు షాక్



- వచ్చే మంగళవారం ఇద్దరూ వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం
- సమన్లు జారీ చేసినా విచారణకు రాకపోవడంపై న్యాయస్థానం అసహనం

2



ఇక ఇంటర్ స్థానంలో 10+2

వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

- నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్య
- ఐదు నుంచి ఎనిమిది వరకు సెకండరీ..
- తొమ్మిది నుంచి 12 వరకు సీనియర్ సెకండరీ
- డ్రాపౌట్ విద్యార్థుల సంఖ్య తగ్గించడమే లక్ష్యం
- అధ్యాపకులు, సిబ్బంది ప్రయోజనాలకు భరోసా
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం



విద్యార్థుల భవిష్యత్తు, ప్రయోజనాలే పరమావధిగా రాష్ట్రంలో సమగ్ర విద్యా సంస్కరణలు చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు నాణ్యమైన విద్యా బోధన అందించడం ద్వారా, ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో విద్యా శాఖపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో 12వ తరగతి వరకు సుదీర్ఘ నిరంతర పాఠశాల విద్యా విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

మైనారిటీల 4 శాతం రిజర్వేషన్లను కాపాడుతాం!



- జాతీయ విద్యా దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

.. వివరాలు 2లో

భారత చరిత్రకు మహా సౌధం

రూ.3,230 కోట్లతో 'యుగే యుగీన్ భారత్' మ్యూజియంకు కేంద్ర కేబినెట్ ఆమోదం



- నార్త్, సౌత్ బ్లాక్ భవనాల్లో భారీ మ్యూజియం నిర్మాణం
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలంగా రికార్డు
- 2027 ద్వితీయార్థంలో తొలి గ్యాలరీ ప్రారంభం
- ఏడాదికి కోటి మంది సందర్శకుల రాక అంచనా


వివరాలు 4లో..

చెరువుల పరిరక్షణలో తగ్గేది లేదు

మూసీ సుందరీకరణ కాదు.. కాలుష్య విముక్తే లక్ష్యం
త్వరలో మూసీ పునరుజ్జీవన తొలి దశ పనులు
సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలోనూ నాగార్జున హీరో!
తమ్మిడికుంట చెరువు ప్రారంభంలో సీఎం రేవంత్



రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయాలి



- రేవంత్‌కు రాష్ట్రంలో కరువు కనిపించడంలేదా
- నా గడ్డంపైనే రేవంత్‌కు ఫికర్
- ప్రతి వ్యవసాయ కూలీకి నెలకు రూ.వెయ్యి చొప్పున చెల్లించాలి
- ప్రధాని మోదీ మనసులో తెలంగాణకు చోటు లేదా?
- సంక్షేమ సారథి కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకోవాలి
- నిర్మల్ రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



సోనియా గాంధీపై కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు

- 'అనుమానాస్పద విదేశీయురాలు' అంటూ విమర్శలు

4

15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు

కుల్గామ్ సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్రదాడి!



.. వివరాలు 4లో

స్వచ్ఛతలో హైదరాబాద్ నంబర్ వన్!

- తెలంగాణలో అత్యంత పరిశుభ్రమైన నగరంగా భాగ్యనగరానికి గుర్తింపు
- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో జీహెచ్ఎంసీకి పురస్కారం
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులకు సీఎం అభినందనలు

2



స్వచ్ఛతలో భాగ్యనగరం మరోసారి సత్తా చాటింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో అత్యంత పరిశుభ్రమైన నగరంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా సీఎం హర్షం వ్యక్తం చేస్తూ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు అభినందనలు తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకే భారత్ సమ్మిట్-2



- రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై అంతర్జాతీయ స్థాయి చర్చలు
- 13, 14న హైదరాబాదులో భారత్ సమ్మిట్ నిర్వహణ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3

భారత్ సమ్మిట్ కాదు.. యాంటీ భారత్ సమ్మిట్



- హామీలన్నీ అమలు చేశాకే రాహుల్, ప్రియాంక తెలంగాణలో అడుగు పెట్టాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధ్వజం

3



హైడ్రా కమిషనర్, శంషాబాద్ తహసీల్దార్‌కు హైకోర్టు షాక్

వచ్చే మంగళవారం ఇద్దరూ హాజరుకావాలని ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): గతంలో జారీ చేసిన సమన్ల మేరకు విచారణకు హాజరుకాని అధికారులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ ఎన్.వి. రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్‌ను వచ్చే మంగళవారం న్యాయస్థానం ఎదుట వ్యక్తిగతంగా హాజరుపరచాలని డీజీపీ సీవీ ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావడం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ హైడ్రా కమిషనర్ రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్ దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. గతంలోనే సమన్లు జారీ చేసినప్పటికీ అధికారులు కోర్టుకు హాజరుకాకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. వచ్చే మంగళవారం జరిగే విచారణకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను స్వయంగా హాజరుపరిచే బాధ్యతను డీజీపీకి అప్పగించింది. అదేవిధంగా శంషాబాద్ తహసీల్దార్‌ను కూడా న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

మైనారిటీల 4 శాతం రిజర్వేషన్లను కాపాడుతాం!

విద్యా, సంక్షేమ పథకాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

జాతీయ విద్యా దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా నగరంలోని బంజారా భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ క లాం ఆజాద్ ఆశయాలు, స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు యువతలో నైపుణ్యాభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యు న్నత ప్రాధాన్యమిస్తోందని ఆయన స్పష్టం చేశారు. మైనారిటీ వర్గాల సంక్షే మానికి తమ ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మైనారిటీలకు అమలవుతున్న 4శాతం రిజర్వేషన్లు, మె రుగైన విద్యా అవకాశాలు, వివిధ సంక్షేమ పథకాల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ఐటీఐలను అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దడంతో పాటు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీల స్థాపన ద్వారా తె లంగాణ యువతకు గ్లోబల్ స్థాయిలో నూతన అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి ఒక్క తల్లిదండ్రులకు ము ఖ్యమంత్రి ఒక ఆత్మీయ విజ్ఞప్తి చేశారు. తమ పిల్లలను ఉన్నతంగా చదివించి, వారిలో దాగి ఉన్న ప్రతిభను ముందే గుర్తించి నైపుణ్యాల్లో, క్రీడల్లో విశేషంగా ప్రోత్సహించాలని కోరారు. "మీ బిడ్డల కలలు నెరవేరాలి.. మీ కుటుంబాలు సమాజంలో ఉన్నతంగా ఎదగాలి. అందుకోసం ఒక సోదరుడిగా మీకు ఎల్లవేళలా సంపూర్ణ అండగా ఉంటాను" అని సీఎం హామీ ఇచ్చారు.

భూ రీసర్వేను నిరంతరం పర్యవేక్షించాలి

క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్లతో సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): భూ రీసర్వే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ క్రమంలోనే భూ రీసర్వే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. భూ రీసర్వే ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సర్వే అనంతరం అభ్యంతరాల స్వీకరణపై రైతులకు అవగాహన కల్పించాలని, నోటీసుల జారీ తర్వాత ప్రతి 15 రోజులకు గ్రామాల్లో చాటింపు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం 708 రోవర్లతో కొనసాగుతున్న రీసర్వేకు వారం రోజుల్లో అదనంగా 400 రోవర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని 141 రెవెన్యూ గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే చేపడుతున్నట్లు, ఎన్ఓపీలో అవసరమైన మార్పులు, చేర్పులు చేయనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ--ఫారెస్ట్ భూముల సరిహద్దుల నిర్ధారణ, 22ఎ భూముల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి.. పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లను ఆదేశించారు. వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హనుమకొండ జిల్లాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి వెంటనే భూములను గుర్తించాలని సూచించారు. 2బీహెచ్‌కే ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. భూ రీసర్వే పనితీరులో నల్గొండ, ఖమ్మం జిల్లాలపై ప్రశంసలు వ్యక్తం చేయగా, నిజామాబాద్ జిల్లాలో రీసర్వే పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇక ఇంటర్ స్థానంలో 10+2!

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్య
- ఐదు నుంచి ఎనిమిది వరకు సెకండరీ..
- తొమ్మిది నుంచి 12 వరకు సీనియర్ సెకండరీ
- డ్రాపౌట్ విద్యార్థుల సంఖ్య తగ్గించడమే లక్ష్యం
- అధ్యాపకులు, సిబ్బంది ప్రయోజనాలకు భరోసా
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం



హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): తెలంగాణ విద్యావ్యవస్థలో కీలక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వచ్చే 2027-28 విద్యా సంవత్సరం నుంచి ప్రస్తుతం అమల్లో ఉన్న ఇంటర్మీడియట్ విద్యావిధానం స్థానంలో 10+ 2 విధానాన్ని ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతి తర్వాత ప్రత్యేకంగా జూనియర్ కళాశాలల్లో చేరాల్సిన ప్రస్తుత విధానాన్ని మార్చి, 11, 12 తరగతులను పాఠశాల విద్యలో భాగం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్య అందిం చడంతోపాటు చదువును మధ్యలో మానేసే పరిస్థితులను నివా రించడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశమని సీఎం స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వ హించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, విద్యార్థుల ప్రయోజనాల విష యంలో రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం జూనియర్ కళాశాలల్లో చేరుతున్నారు. కొత్త విధానంలో 11, 12 తరగతులను పాఠశాల విద్యావ్యవస్థలో అంతర్భాగంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం విద్యాబోధన, పరిపాలన, మౌలిక వసతుల్లో అవసరమైన మార్పులు చేపట్టాలని సీఎం సూచించారు. నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్య, ఐదో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు సెకండరీ విద్య, తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా విభజించాలని ఆదేశించారు. 12వ తరగతి పూర్తయ్యే నాటికి విద్యార్థులు భాషా పరిజ్ఞానం, సమాచార నైపుణ్యాలపై పట్టు సాధించేలా బోధన ఉండాలన్నారు. పదో తరగతి తర్వాత విద్యను మధ్యలోనే వదిలేస్తున్న విద్యార్థుల సంఖ్యపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 40 శాతం మంది విద్యార్థులు పదో తరగతి తర్వాత చదువు కొనసాగించడం లేదని సమీక్షలో పేర్కొన్నారు. వీరిలో బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉంటున్నారని తెలిపారు. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 12వ తరగతి వరకు విద్యాబోధన కొనసాగుతుండటంతో చదువు మానేసే వారి సంఖ్య తక్కువగా ఉంటోందని వివరించారు. తెలంగాణలోనూ అదే తరహాలో విద్యార్థులకు నిరంతర విద్యావకాశాలు కల్పించాలన్నారు. కొత్త విద్యా విధానం అమలుతో జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉద్యోగ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగ భద్రతతోపాటు పదవీ విరమణ ప్రయోజనాలను పరిరక్షిస్తామని తెలిపారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చే సమయంలో విద్యార్థులతోపాటు ఉద్యోగుల ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో ఇప్పటికే 12వ తరగతి వరకు కొనసాగించే విద్యావిధానం అమల్లో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని సీఎం స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యులు, సహ ఆచార్యులు, ఇతర అధ్యాపకుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. నియామకాల్లో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్, విశ్వవిద్యాలయాల ఉపకులపతులకు సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణకు అవసరమైన నిధుల విడుదలను వేగవంతం చేయాలన్నారు. సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి ద్వారా విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. కొత్త 10+ 2 విద్యా విధా నాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు చేసే లా అవస రమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అయితే పాఠశాలలు, జూనియర్ కళాశాలల పునర్వ్యవస్థీకరణ, ప్రవేశాలు, పాఠ్యప్రణాళిక, పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై పూర్తిస్థాయి విధివిధానాలు ఇంకా ఖరారు కావాల్సి ఉంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్పులు అమలు చేయాలని సీఎం స్పష్టం

చెరువుల పరిరక్షణలో తగ్గేది లేదు

- మూసీ సుందరీకరణ కాదు.. కాలుష్య విముక్తే లక్ష్యం
- త్వరలో మూసీ పునరుజ్జీవన తొలి దశ పనులు
- సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలోనూ నాగార్జున హీరో!
- తమ్మిడికుంట చెరువు ప్రారంభంలో సీఎం రేవంత్



హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): సినీ తెరపై కథానాయకుడిగా ప్రేక్షకులను అలరించిన ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున నిజ జీవితంలోనూ హీరో అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణకు రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చి జలవనరుల పరిరక్షణకు సహకరించారని కొనియాడారు. హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నాగార్జున విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చెరువుల పరిరక్షణ, ప్రకృతి వనరుల సంరక్షణ, మూసీ నది పునరుజ్జీవనం వంటి అంశాలపై సీఎం మాట్లాడారు. హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణ విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోదని స్పష్టం చేశారు. భావితరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగరాన్ని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తనకు ఎంతో సుపరిచితమైన తమ్మిడికుంట చెరువు మళ్లీ జీవం పోసుకోవడం ఆనందంగా ఉందని నాగార్జున పేర్కొన్నారు. హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణ, జలవనరుల పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన స్వాగతించారు. హైడ్రా కృషిని ప్రత్యేకంగా అభినందించారు. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం కూడా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మూసీ నదీతీర అభివృద్ధి కార్యక్రమం ప్రారంభోత్సవానికి కూడా హాజరవుతానని తెలిపారు. మాదాపూర్‌లోని శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట చెరువును హైడ్రా సుమారు రూ.20 కోట్ల వ్యయంతో పునరుద్ధరించింది. ఆక్రమణలు, పూడిక, వ్యర్థాల కారణంగా దాదాపు 14 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువును తిరిగి సుమారు 30 ఎకరాల విస్తీర్ణానికి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. చెరువులో పేరుకుపోయిన పూడిక, ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాలను తొలగించారు. మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెరువు చుట్టూ నడక మార్గం, ఉ ద్యానవనాలు, వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆటస్థలం, యోగా వేదిక వంటి సౌకర్యాలను అభివృద్ధి చేశారు. పునరుద్ధరించిన చెరువులను కేవలం నీటి నిల్వ కేంద్రాలుగానే కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ప్రదేశాలుగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. చెరువుల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతోపాటు పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. కుటుంబాలతో కలిసి ప్రజలు సేదతీరేలా పరిసరాలను అభివృద్ధి చేయాలన్నారు. తమ్మిడికుంట వద్ద ఏర్పాటైన ఆహ్లాదకర వాతావరణాన్ని ప్రస్తావిస్తూ, సమాచార సాంకేతిక రంగ ఉద్యోగులు కూడా అక్కడ ప్రశాంతంగా గడపవచ్చని పేర్కొన్నారు. 'వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట' అనే స్థాయిలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మూసీ నది అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వ లక్ష్యం కేవలం సుందరీకరణ మాత్రమే కాదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాలుష్యంతో దెబ్బతిన్న మూసీకి తిరిగి జీవం పోయడం, నదిని పరిశుభ్రంగా మార్చడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మూసీ పునరుజ్జీవన తొలి దశ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో ఎవరికీ నష్టం జరగకుండా చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌కు ఒకప్పుడు ఉన్న చెరువుల నగరమనే ప్రత్యేక గుర్తింపును తిరిగి తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరీకరణ కారణంగా దెబ్బతిన్న జలవనరులను పునరుద్ధరించడం ద్వారా భూగర్భ జలాలను పెంచడంతోపాటు వరద ముంపు సమస్యలను తగ్గించవచ్చని వివరించారు. చెరువుల పరిరక్షణలో ప్రభుత్వ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను కాపాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తమ్మిడికుంట పునరుద్ధరణ ఆ దిశగా చేపట్టిన కార్యక్రమాల్లో ఒకటని పేర్కొన్నారు

స్వచ్ఛతలో హైదరాబాద్ నంబర్ వన్!

- తెలంగాణలో అత్యంత పరిశుభ్రమైన నగరంగా భాగ్యనగరానికి గుర్తింపు
- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో జీహెచ్ఎంసీకి పురస్కారం
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీపీ అధికారులకు సీఎం అభినందనలు



హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): స్వచ్ఛతలో భాగ్యనగరం మరోసారి సత్తా చాటింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025--26లో తెలంగాణ రాష్ట్రంలో అత్యంత పరిశుభ్రమైన నగరంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ పురస్కారం సాధించేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు అభినందనలు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు ఈ గుర్తింపు లభించినట్లు పేర్కొన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటా చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాల్లో సాధించిన పురోగతికి ఈ పురస్కారం నిదర్శనమని సీఎం అభివర్ణించారు. హైదరాబాద్ నగరానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పురస్కారాన్ని అందుకున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వివిధ విభాగాల మధ్య సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు లభించిన ఈ గుర్తింపు వెనుక పారిశుద్ధ్య కార్మికుల నిరంతర శ్రమ ఉందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారు. నగరంలోని వీధులు, ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాలు, ప్రజా ప్రదేశాలను పరిశు భ్రంగా ఉంచేందుకు అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇంటింటా చెత్త సేకరణ నుంచి వ్యర్థాల శుద్ధి వరకు ప్రతి దశలోనూ పారిశుద్ధ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ పురస్కారం కేవలం అధికార యంత్రాంగానికే కాకుండా నగర పరిశుభ్రత కోసం పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నగరంలో పచ్చదనాన్ని పెంచడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను నికర శూన్య కర్బన ఉద్గారాల నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. నగరాభివృద్ధితోపాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో లభించిన గుర్తింపుతో సంతృప్తి చెందకుండా నగరంలో పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి, ప్రజా ప్రదేశాల పరిశుభ్రత వంటి అంశాల్లో మరింత సమర్థవంతమైన చర్యలు చేపట్టాలన్నారు. నగర ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యం పూర్తిస్థాయిలో సాకారమవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను పరిశుభ్రమైన, పర్యావరణహితమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే ప్రభుత్వ సంకల్పానికి ఈ పురస్కారం మరింత ప్రోత్సాహాన్నిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయాలి

- రేవంత్‌కు రాష్ట్రంలో కరువు కనిపించడంలేదా
- నా గడ్డంపైనే రేవంత్‌కు ఫికర్
- ప్రతి వ్యవసాయ కూలీకి నెలకు రూ.వెయ్యి చొప్పున చెల్లించాలి
- ప్రధాని మోదీ మనసులో తెలంగాణకు చోటు లేదా?
- సంక్షేమ సారథి కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకోవాలి
- నిర్మల్ రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నిర్మల్, నవంబర్ 11 (చురకలు): రాష్ట్రంలో తీవ్రంగా నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలను ప్రభుత్వం వెంటనే రీషెడ్యూల్ చేయాలని, మిగిలిపోయిన రైతు రుణమాఫీని తక్షణమే పూర్తి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నిర్మల్‌లో బుధవారం నిర్వహించిన భారీ 'రైతు గర్జన' సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులకు నీళ్లు ఇస్తానని చెప్పే ధైర్యం లేదని, కరెంట్ ఇస్తానని భరోసా ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేదని మండిపడ్డారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున, కరువు కారణంగా ఉపాధి కోల్పోయిన ప్రతి వ్యవసాయ కూలీకి నెలకు రూ.వెయ్యి చొప్పున 36 నెలలకు గాను మొత్తం రూ.36 వేల ఆర్థిక సహాయం తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నిలిచిపోయిన నాలుగు విడతల రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. తన గడ్డంపై ఉన్న శ్రద్ధ రైతులకు ధైర్యం చెప్పడంలో రేవంత్ రెడ్డికి లేదని ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో తిరస్కరించి, సంక్షేమ సారథి కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో ఓట్లు, సీట్లు మాత్రమే కావాలని ఆశపడే కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రానికి నిధులు ఇచ్చే సోయి లేదని కేటీఆర్ మండిపడ్డారు. ప్రధాని మోదీ మనసులో అసలు తెలంగాణకు చోటు ఉందా అని ప్రశ్నించారు. చేతనైతే బీజేపీ నాయకులు ప్రధాని మోదీ ఇంటి ముందు ధర్నా చేయాలని సవాల్ విసిరారు. గత మూడేళ్లలో బీజేపీ వల్ల రాష్ట్రానికి గానీ, నిర్మల్ జిల్లాకు గానీ ఏమైనా మంచి జరిగిందా అని నిలదీశారు. ఆదిలాబాద్‌లో ఉన్న సీసీఐ ఫ్యాక్టరీని తుక్కు కింద అమ్మేస్తుంటే బీజేపీ నాయకులు నోరు మెదపడం లేదని, రావాల్సిన నవోదయ విద్యాలయం కూడా రాలేదని ధ్వజమెత్తారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు కేంద్ర కరువు బృందాలు వస్తున్నాయని, కానీ తెలంగాణలో నెలకొన్న కరువు మాత్రం వారికి కనిపించడం లేదని విమర్శించారు. ఆంధ్రాకు నీళ్లు ఇచ్చి తెలంగాణకు ఎక్కిళ్లు తెప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాటలతో, నాటకాలతో ప్రజల కడుపు నిండదని, రైతులు, యువత, మహిళలు, దళితులు, మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లతో సహా అందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మూడేళ్లలో రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసిన రేవంత్ రెడ్డి, ఆ నంతా ఎక్కడికి తీసుకెళ్తున్నారని ప్రశ్నించారు. పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేయడంతో మళ్లీ రైతుల ఇళ్ల ముందు చావు డప్పు మోగే పరిస్థితులు వచ్చాయన్నారు. సమర్థవంతమైన పాలన లేక విద్యుత్ కోతలతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కన్నెపల్లి దగ్గర పంపులు ఆన్ చేయకపోవడం వల్ల గోదావరి నీళ్లు కిందకు వృథాగా పోతున్నాయని, ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, పాలకులు తెచ్చిన వికృతి కరువు అని విమర్శించారు. కేసీఆర్ నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీని కూడా సరిగ్గా ఉపయోగించుకోవడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమానికి కేసీఆర్ నాడు తొలిసారిగా సారథ్యం వహిస్తానని ప్రకటించిన పవిత్ర గడ్డ నిర్మల్ అని కేటీఆర్ గుర్తుచేశారు. రాష్ట్రాన్ని సాధించి ఇచ్చిన మాట ప్రకారం ఎండిపోయిన ప్రాజెక్టుల్లో నీళ్లు పారించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సమైక్య పాలనలోని నీటితీరువాను శాశ్వతంగా రద్దు చేసి, 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులను బాగుచేసి మండుటెండల్లో మత్తళ్లు దూకేలా చేశారని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 11 విడతల్లో రైతుబంధు, రైతు బీమా పథకాలను అందించి రైతులకు కొండంత అండగా నిలిచారన్నారు. అలాగే పోడు భూములకు పట్టాలు ఇవ్వడం, గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచడం, మిషన్ భగీరథ ద్వారా పరిశుభ్రమైన మంచినీరు అందించడం కేసీఆర్ కే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన రూ.5 లక్షల విద్యా భరోసా హామీ అమలు కాలేదని, రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నిలిచిపోయాయని విమర్శించారు. తక్షణమే ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేసి, పెండింగ్ డీఏలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకే భారత్ సమ్మిట్-2



- రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై అంతర్జాతీయ స్థాయి చర్చలు
- 13, 14న హైదరాబాదులో భారత్ సమ్మిట్ నిర్వహణ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'భారత్ సమ్మిట్-2026' ద్వారా రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలపై ప్రపంచ రంగానికి దిశానిర్దేశం చేసే అంతర్జాతీయ వేదికగా హైదరాబాద్ నగరం రూపాంతరం చెందనుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న హింస, విద్వేష రాజకీయాలు, విభజన ధోరణుల నేపథ్యంలో ప్రజాస్వామ్య విలువలను పటిష్ఠంగా పరిరక్షించే మహత్తర లక్ష్యంతో ఈనెల 13, 14 తేదీల్లో భారత్ సమ్మిట్-2 నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదులు, ఉదారవాదులు, ప్రగతిశీల భావాలు కలిగిన మేధావులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి నూతన దిశానిర్దేశం చేయాలనే తపనతో ఈ సదస్సును రూపొందించిందన్నారు. హైటెక్స్‌లోని ఒక ప్రముఖ హోటల్‌లో సదస్సు విజయవంతం కొరకు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ అంతర్జాతీయ సదస్సులో భాగస్వామ్యం అయ్యేందుకు 70కిపైగా దేశాల నుంచి వెయ్యిమందికి పైగా ప్రజాప్రతినిధులు, విధాన నిర్ణేతలు, విద్యావేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు ఇప్పటికే తమ అంగీకారం తెలిపారని వెల్లడించారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంలో, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నేపథ్యంలో ఈ సదస్సుకు అంతర్జాతీయంగా ప్రత్యేక ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. మహాత్మా గాంధీ బోధించిన అహింసా సిద్ధాంతం, భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అనుసరించిన అలీన విదేశాంగ విధానం, మిశ్రమ ఆర్థిక విధానాలు భారతదేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు నేటి పరిస్థితుల్లో ఎంతో ఆవశ్యకమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కొన్ని అగ్రరాజ్యాల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించే క్రమంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ స్వతంత్ర గుర్తింపును, అస్తిత్వాన్ని కోల్పోకూడదన్నదే నెహ్రూ మూల ఆలోచన అని చెప్పారు. భారతదేశం స్వశక్తితో ఎదగడమే కాకుండా ప్రపంచంలోని ప్రగతిశీల, అభివృద్ధి చెందుతున్న దేశాలకు సగర్వంగా నాయకత్వం వహించాలన్న ఆయన దూరదృష్టి దేశానికి బలమైన పునాదులు వేసిందన్నారు. నాటి పంచవర్ష ప్రణాళికలు, ఇతర ఆర్థిక విధానాలు దేశాన్ని పటిష్ఠం చేశాయని, నేడు అంతర్జాతీయంగా భారత్‌కు లభిస్తున్న గుర్తింపులో నెహ్రూ విధానాల పాత్ర అత్యంత కీలకమని వివరించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం ఎంత కీలకమో ప్రతిపక్షం కూడా అంతే ప్రాముఖ్యమైనదని, ఈ రెండూ ప్రజాస్వామ్యానికి రెండు బలమైన స్తంభాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నవారు ప్రతిపక్ష పార్టీలను, నేతలను శత్రువులుగా చూడకూడదని, కేవలం తమతో విభేదించే రాజకీయ ప్రత్యర్థులుగానే భావించాలని సూచించారు. ప్రతిపక్షాల ఆలోచనలను వ్యతిరేకించవచ్చు తప్ప వారిని శత్రువులుగా పరిగణించడం ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకే విరుద్ధమన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రతిపక్షాలను శత్రువులుగా చూస్తూ, వాటి నాయకత్వాన్ని రాజకీయంగా అంతం చేయాలనే కుట్రలు జరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాలు రెండూ సమర్థవంతంగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను బలంగా విశ్వసిస్తుందని, ఈ అంశాలపై లోతైన చర్చలు జరిపేందుకు అన్ని పార్టీలను, నాయకులను భారత్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం అత్యంత ప్రాథమికమైన రాజ్యాంగ హక్కు అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఓటు హక్కు ద్వారానే ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ పొందుతారని చెప్పారు. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ కఠినంగా వ్యతిరేకిస్తోందన్నారు. రాహుల్ గాంధీ నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారని వివరించారు. దేశంలో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న ప్రతి పౌరుడి తరఫున తాము పోరాడుతున్నామని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల కమిషన్, ప్రభుత్వాల ప్రధాన బాధ్యత కావాలని అన్నారు. ప్రగతిశీల ఆలోచనలు కలిగిన కాంగ్రెస్ పార్టీ ఆ సిద్ధాంతాలతోనే ముందుకు సాగుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాహుల్ గాంధీని రీ లాంచ్ చేయడానికే భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నారంటూ కొందరు బీజేపీ నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ నాయకుడని, ఆయనను ప్రత్యేకంగా లాంచ్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మోదీ తర్వాత ఎవరిని లాంచ్ చేద్దామని బీజేపీ ఆలోచిస్తోందో చెప్పాలని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ విశాల ఆలోచనా విధానం బీజేపీకి ఎప్పటికీ అర్థం కాదని ఎద్దేవా చేశారు. కేవలం రాజకీయాలు కాకుండా ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యలకు భారత్ సమ్మిట్ ద్వారా పరిష్కార మార్గాలు అన్వేషించాలన్నదే తమ తపన అని స్పష్టం చేశారు. ఇది ఒక అంతర్జాతీయ ఎకనామిక్ సమ్మిట్‌లా ఉపయోగపడుతుందన్నారు. ఈ సదస్సులో యూత్, టెక్నాలజీ, జెన్ జీలు లేవనెత్తిన పలు అంశాలపై మేధోపరమైన చర్చ జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అప్రజాస్వామిక చర్యలపై కూడా స్పందిస్తామని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌ఛార్జి గురుదీప్ సింగ్ సప్పల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సమృద్ధ భారత్ ఫౌండేషన్ డైరెక్టర్ పుష్పరాజ్ దేశ్‌పాండే తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



సోనియా గాంధీ బయోపిక్ తీస్తా

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబర్ 11 : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ జీవిత చరిత్రను వెండితెరకు ఎక్కించేందుకు ఆమె రాసిన ఆత్మకథ ఆధారంగా తెలుగులో బయోపిక్ సినిమాను నిర్మిస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రకటించారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ సంచలన విషయాన్ని వెల్లడించారు. 'ఏ జర్నీ ఆఫ్ లవ్' ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తామని, ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి త్వరలోనే నిర్మాణ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సినిమాకు సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలుగా వ్యవహరిస్తారని సరదాగా వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు చేతుల మీదుగా ఈ సినిమా షూటింగ్‌ను అట్టహాసంగా ప్రారంభిస్తామని తెలిపారు. ఇందిరా గాంధీ కోడలిగా, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ భార్యగా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల తల్లిగా సోనియా గాంధీ సాగించిన సుదీర్ఘ జీవిత ప్రయాణాన్ని ఈ సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపిస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు చేసిన ప్రాణత్యాగాలను దగ్గరుండి చూసిన సోనియా గాంధీ ధైర్యం, ఆమె రాజకీయ ప్రస్థానం నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



అక్రమ అండాల సేకరణ కేసులో

కీలక పరిణామం

8 మంది నిందితులు పోలీసుల కస్టడీకి!

హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): నగరంలో సంచలనం సృష్టించిన అక్రమ మానవ అండాల సేకరణ కేసులో బేగంపేట్ పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా మొత్తం ఎనిమిది మంది నిందితులను కోర్టు అనుమతితో బుధవారం జైలు నుంచి పోలీసుల కస్టడీలోకి తీసుకున్నారు. గురువారం నుంచి ఐదు రోజుల పాటు నిందితులను కస్టడీలో ఉంచుకుని లోతుగా విచారించనున్నారు. మరోవైపు, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టయిన మరో నిందితుడు దుర్గాప్రసాద్‌ను కూడా పీటీ వారెంట్‌పై బేగంపేట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత అక్టోబర్ 31న వెలుగులోకి వచ్చిన ఈ అక్రమ మానవ అండాల సేకరణ వ్యవహారంలో బేగంపేట్, సరూర్‌నగర్, ఎల్బీనగర్ పోలీసులు మూడు వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బేగంపేట్ పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్ శర్మ ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారిగా వ్యవహరించినట్లు గుర్తించారు. నగరంలోని ఐవీఎఫ్, ఏఆర్‌టీ (ూ=) కేంద్రాలకు అండాలను సరఫరా చేసే ఉద్దేశంతో పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి పేదరికంలో ఉన్న యువతులు, మహిళలకు డబ్బు ఆశ చూపి హైదరాబాద్‌కు రప్పించినట్లు తేలింది. అనంతరం వారిని ఒక మహిళా హాస్టల్‌లో ఉంచి, వారి ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతంగా అండాలను సేకరించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే అమిత్ శర్మ, నిఖిత్ పర్వీన్, రేష్మా ఖాతూన్, మేఘావత్ శ్రీనివాస్, ఎస్.కే. పర్వీన్, విజయ్ భాగ్యరావు, పంకజ్ సోనిలతో పాటు సరూర్‌నగర్ పరిధిలో దుర్గాప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సైదాబాద్‌కు చెందిన ప్రవీణ్ సహాయంతో నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి, యువతులు మరియు మహిళల వివరాలను తారుమారు చేసి పలుమార్లు అండాలను సేకరించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఈ అనైతిక కార్యకలాపాలు సాగినట్లు గుర్తించారు.

రూ. 2 కోట్ల లావాదేవీలపై ఆరా.. 16 కేంద్రాలకు నోటీసులు

ప్రధాన నిందితుడు అమిత్ శర్మ ముఠాతో నగరంలోని ఒక ప్రముఖ ఐవీఎఫ్, ఏఆర్‌టీ కేంద్రానికి సంబంధించి సుమారు రూ. 2 కోట్ల మేర భారీ ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు కీలక సమాచారం రాబట్టారు. ఈ నేపథ్యంలో నగరంలోని సుమారు 16 ఐవీఎఫ్, ఏఆర్‌టీ కేంద్రాల నిర్వాహకులకు బేగంపేట్ పోలీసులు అధికారికంగా నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్న నిందితులను వివిధ కోణాల్లో ప్రశ్నిస్తున్నారు. ఈ ఐదు రోజుల కస్టడీ విచారణలో మరిన్ని కీలక ఆధారాలు, ఈ అక్రమ నెట్‌వర్క్‌లో భాగస్వాములైన ఇతర ఆసుపత్రులు, వ్యక్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కాగా, ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన నిందితుల సంఖ్య మొత్తం 10కి చేరింది. అయితే ఈ కస్టడీ విచారణకు సంబంధించి మల్కాజిగిరి పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలను ఇంకా వెల్లడించాల్సి ఉంది.

శ్రీరామనవమి నాటికి పుష్కర పనులు పూర్తి చేయాలి

దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఆదేశం

భద్రాచలం, నవంబర్ 11 (చురకలు): రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలోని గోదావరి తీర ప్రాంతాల్లో చేపడుతున్న ఘాట్ల అభివృద్ధి పనులు మరియు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ పరిసరాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రాచలంలో ఆలయ అభివృద్ధి పనులు, నూతన గోదావరి పుష్కర ఘాట్ నిర్మాణ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠాతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, కన్సల్టెంట్లు, ఆర్కిటెక్టు, కాంట్రాక్టర్లతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ రామయ్యర్ మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి భద్రాచలానికి తరలివచ్చే శ్రీ సీతారామచంద్ర స్వామి వారి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూపాలన్నారు. గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, సురక్షితమైన స్నాన ఘాట్లు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, డ్రైనేజీ, వైద్య సదుపాయాలు, భద్రత, రవాణా, అగ్నిమాపక ఏర్పాట్లన్నింటినీ వివిధ శాఖల సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పుష్కర వనం కోసం అనువైన స్థలాన్ని సేకరించాలని, వీఐపీలకు మరియు సాధారణ భక్తులకు వేర్వేరుగా విశాలమైన పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడంతో పాటు భక్తుల కోసం ప్రత్యేక డైరెక్టరీలను సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బీ ఈఈ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈఈ అనూష, ట్రాన్స్‌కో ఎస్ఈ మహేందర్, డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్, డీఏవో భగవన్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, సర్పంచ్ పూనెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం



ఎన్విడియాలో నాయకత్వ మార్పు?

సీఈవో రేసులో భారతీయుడి పేరు!

జెన్సన్ హువాంగ్ నాయకత్వంపై చర్చకు దారితీసిన తీవ్ర ఆరోపణలు

చైనాకు అధునాతన చిప్‌ల తరలింపు ఆరోపణలతో కొత్త వివాదం

ప్రపంచ కృత్రిమ మేధ రంగంలో అగ్రగామిగా ఉన్న అమెరికా చిప్‌ల తయారీ సంస్థ ఎన్విడియా తీవ్ర వివాదంలో చిక్కుకుంది. సంస్థ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యనిర్వహణాధికారి జెన్సన్ హువాంగ్ వివాహేతర సంబంధం వ్యవహారం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. చైనా గూఢచారిగా అనుమానిస్తున్న ఓ వ్యాపారవేత్తతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే కథనాలు వెలువడటంతో సంస్థ పాలక మండలి స్వతంత్ర దర్యాప్తు ప్రారంభించింది. ఈ పరిణామాల నేపథ్యంలో కంపెనీ షేర్లు ఒత్తిడికి గురికాగా, భవిష్యత్తులో నాయకత్వ మార్పు జరిగితే బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనే చర్చ మొదలైంది. ఈ క్రమంలో భారత సంతతికి చెందిన ఎన్విడియా మాజీ ఉన్నతాధికారి జై పురీ పేరు కూడా వినిపిస్తోంది. అయితే సీఈవో మార్పుపై సంస్థ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం ప్రకటించలేదు. జెన్సన్ హువాంగ్ సంస్థకు నాయకత్వం వహిస్తూనే ఉంటారని ఎన్విడియా స్పష్టం చేసింది.

సీఈవో రేసులో భారతీయుడు జై పురీ!

ఎన్విడియా నాయకత్వంలో మార్పు జరిగే పరిస్థితి తలెత్తితే అనుభవజ్ఞులైన ఉన్నతాధికారుల పేర్లను పరిశీలించే అవకాశం ఉందని వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీరిలో భారత సంతతికి చెందిన జై పురీ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. 2009 నుంచి ఎన్విడియాలో ప్రపంచవ్యాప్త కార్యకలాపాల విభాగానికి కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆయనకు అంతర్జాతీయ విక్రయాలు, వ్యాపార విస్తరణ, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, వినియోగదారుల సంబంధాల నిర్వహణలో విశేష అనుభవం ఉంది. 2026 ఆగస్టులో పదవీ విరమణ చేసినప్పటికీ బాధ్యతల బదిలీ సమయంలో సీనియర్ సలహాదారుగా కొనసాగనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఎన్విడియా వ్యాపార వ్యవస్థపై ఆయనకున్న అవగాహన కారణంగా నాయకత్వ చర్చల్లో ఆయన పేరు ప్రస్తావనకు వస్తోంది. అయితే జై పురీని సీఈవోగా పరిశీలిస్తున్నట్లు సంస్థ అధికారికంగా ధ్రువీకరించలేదు.

కొలెట్ క్రెస్, ఇయాన్ బక్ పేర్లపైనా చర్చ!

ఎన్విడియా ఆర్థిక విభాగ అధిపతి కొలెట్ క్రెస్ పేరు కూడా నాయకత్వ చర్చల్లో వినిపిస్తోంది. 2013లో సంస్థలో చేరిన ఆమెకు ఆర్థిక నిర్వహణ, పెట్టుబడిదారులతో సంబంధాలు, వ్యాపార విస్తరణలో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో మైక్రోసాఫ్ట్, సిస్కో, టెక్సస్ ఇన్‌స్ట్రుమెంట్స్ వంటి సంస్థల్లో పనిచేశారు. మరోవైపు ఎన్విడియా సాంకేతిక విభాగంలో కీలక పాత్ర పోషించిన ఇయాన్ బక్ పేరు కూడా ప్రస్తావనకు వస్తోంది. గ్రాఫిక్స్ ప్రాసెసర్లను సాధారణ గణనలకు వినియోగించేందుకు రూపొందించిన 'కూడ' సాంకేతికత అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. సంస్థ ప్రధాన శాస్త్రవేత్త బిల్ డాలీ, సహ వ్యవస్థాపకుడు క్రిస్ మాలచౌవ్‌స్కీ పేర్లు కూడా చర్చల్లో ఉన్నాయి.

ఎన్విడియాపై జెన్సన్ పట్టు సడలుతుందా?

1993లో ఎన్విడియాను సహ వ్యవస్థాపకుడిగా ప్రారంభించిన జెన్సన్ హువాంగ్ సంస్థను ప్రపంచ కృత్రిమ మేధ చిప్‌ల రంగంలో అగ్రస్థానానికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. ఆయనకు కంపెనీలో సుమారు 3.56 శాతం వాటా ఉన్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. సంస్థలోని కీలక ఉన్నతాధికారులు నేరుగా ఆయనకే నివేదించే విధానం కొనసాగుతోంది. అంతేకాకుండా ఆయన కుటుంబ సభ్యులు కూడా ఎన్విడియాలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కుమారుడు స్పెన్సర్ హువాంగ్ ఉత్పత్తుల నిర్వహణ విభాగంలో, కుమార్తె మాడిసన్ ఉత్పత్తుల ప్రచార విభాగంలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాయకత్వ మార్పు జరిగితే సంస్థ అంతర్గత వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశం చర్చనీయాంశమైంది.

చైనా గూఢచారి ఆరోపణలతో కలకలం!

జెన్సన్ హువాంగ్‌తో సంబంధం ఉన్నట్లు వార్తల్లో పేర్కొంటున్న అలిస్ హువాంగ్ వ్యవహారం వివాదానికి కేంద్రబిందువుగా మారింది. సింగపూర్‌కు చెందిన మెగాస్పీడ్ సంస్థతో సంబంధాలున్న ఆమె చైనా గూఢచార సంస్థ తరఫున పనిచేసినట్లు అమెరికా నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయని అంతర్జాతీయ కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ ఆరోపణలు బహిరంగంగా నిరూపితం కాలేదు. చైనా ప్రభుత్వం వాటిని ఖండించింది. జెన్సన్ హువాంగ్ తన భార్యకు నమ్మకద్రోహం చేసినట్లు ఉద్యోగులకు పంపిన సందేశంలో అంగీకరించి క్షమాపణలు తెలిపారు. అయితే గూఢచర్య కార్యకలాపాల్లో ఆయనకు తెలిసి ప్రమేయం ఉన్నట్లు ఇప్పటివరకు బహిరంగ ఆధారాలు వెల్లడికాలేదు. అలిస్ హువాంగ్, ఆమె భర్త, సోదరి కలిసి చైనా, సింగపూర్‌లలో సంస్థల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు 'ది ఇన్ఫర్మేషన్' కథనం వెల్లడించింది. షాంఘై సెంచరీ లిటాంగ్, మెగాస్పీడ్ వంటి సంస్థల ద్వారా సుమారు 750 కోట్ల డాలర్ల విలువైన ఎన్విడియా చిప్‌ల కొనుగోళ్లకు మార్గం సుగమమైందని ఆరోపించింది. అమెరికా ఎగుమతి ఆంక్షల పరిధిలోని హెచ్100, హెచ్200, ఏ100 వంటి సుమారు 2.40 లక్షల అధునాతన చిప్‌లను చైనాకు తరలించినట్లు ఆ కథనం పేర్కొంది. అయితే ఈ ఆరోపణలపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతోంది. మెగాస్పీడ్ అక్రమ కార్యకలాపాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను ఖండించింది. ఈ వివాదం నేపథ్యంలో ఎన్విడియా పాలక మండలి స్వతంత్ర విచారణ ప్రారంభించింది. అమెరికా దర్యాప్తు సంస్థలు కూడా చిప్‌ల ఎగుమతులు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తున్నాయి. సంస్థ రహస్యాలు లేదా జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారం బయటకు వెళ్లినట్లు భావించడానికి ప్రస్తుతం తమ వద్ద ఆధారాలు లేవని ఎన్విడియా పాలక మండలి పేర్కొంది. జెన్సన్ హువాంగ్ సీఈవోగా కొనసాగుతారని సంస్థ ప్రకటించింది. దీంతో జై పురీ సహా ఇతరుల పేర్లు వినిపిస్తున్నప్పటికీ నాయకత్వ మార్పు ఇప్పటికైతే ఊహాగానాల స్థాయిలోనే ఉంది. దర్యాప్తులో వెలుగుచూసే అంశాలు ఎన్విడియా భవిష్యత్తు నిర్ణయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.

భారత చరిత్రకు మహా సౌధం

రూ.3,230 కోట్లతో 'యుగే యుగీ భారత్' మ్యూజియంకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- నార్త్, సౌత్ బ్లాక్ భవనాల్లో భారీ మ్యూజియం నిర్మాణం
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలంగా రికార్డు
- 2027 ద్వితీయార్ధంలో తొలి గ్యాలరీ ప్రారంభం
- ఏడాదికి కోటి మంది సందర్శకుల రాక అంచనా



న్యూఢిల్లీ, నవంబర్ 11 (చురకలు): భారతదేశ ఘనమైన చరిత్ర, నాగరికత, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు సజీవంగా అందించే లక్ష్యంతో ప్రతిపాదించిన బృహత్తర ప్రాజెక్టు 'యుగే యుగీ భారత్ నేషనల్ మ్యూజియం' నిర్మాణానికి మార్గం సుగమమైంది. న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.3,230 కోట్లుగా నిర్ణయించారు. న్యూఢిల్లీలోని రైసినా హిల్స్‌పై రాష్ట్రపతి భవన్‌కు ఇరువైపులా ఉన్న చారిత్రక నార్త్, సౌత్ బ్లాకుల్లో ఈ సరికొత్త జాతీయ మ్యూజియాన్ని ఏర్పాటు చేయనున్నారు. 1912 నుంచి 1931 మధ్య కాలంలో నిర్మించిన ఈ కట్టడాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు ఇతర నూతన భవనాల్లోకి మారిన తర్వాత, వాటిని ప్రజా సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతారు. ఈ క్రమంలో భవనాల అసలు శైలి, చారిత్రక నిర్మాణ వారసత్వానికి ఎలాంటి విఘాతం కలగకుండా పునరుద్ధరించనున్నారు. ఈ మ్యూజియం ద్వారా భారతదేశ అనాది నాగరికతా ప్రయాణం, వైవిధ్యం, భౌతిక మరియు అభౌతిక వారసత్వాన్ని సమగ్రంగా ప్రదర్శించనున్నారు. అత్యాధునిక ఇమ్మర్సివ్ సాంకేతికత, సందర్శకులను ఆకట్టుకునే ప్రత్యేక థీమాటిక్ గ్యాలరీలతో అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలకు ధీటుగా దీనిని రూపొందిస్తున్నారు. పూర్తయిన తర్వాత సుమారు 1,78,509 చదరపు మీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలం(డిస్‌ప్లే ఏరియా) కలిగిన మ్యూజియంగా ఇది రికార్డు సృష్టించనుంది. ఈ ప్రాజెక్టును 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు దశలవారీగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా మొదటి పబ్లిక్ గ్యాలరీ అయిన 'అడోర్నమెంట్'ను నార్త్‌బ్లాక్‌లో 2027 ద్వితీయార్ధంలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మ్యూజియాన్ని ఏటా దాదాపు ఒక కోటి మందికి పైగా సందర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కేబినెట్ ఆమోదించిన రూ.3,230 కోట్ల నిధులను గ్యాలరీల అభివృద్ధి, ప్రాచీన వస్తువుల భద్రత, పరిరక్షణ, సందర్శకుల సౌకర్యాలు, ల్యాండ్‌స్కేపింగ్, ఇంటెలిజెంట్ బిల్డింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, అధునాతన మౌలిక వసతుల కల్పన కోసం వినియోగిస్తారు. భవిష్యత్తులో టికెట్ల విక్రయాలు, ఆహార మరియు పానీయాల విభాగాలు, ప్రత్యేక కార్యక్రమాల వేదికల అద్దెలు, డిజిటల్ అనుభవాలు, గైడెడ్ టూర్లు మరియు ప్రత్యేక రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా మ్యూజియానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోనున్నారు. ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ 2023 మే 18న తొలిసారిగా ప్రకటించగా, 2026 జూలై 27న పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు దీనికి ప్రాథమిక అనుమతులు మంజూరు చేసింది. తాజా కేబినెట్ ఆమోదంతో పనులు మరింత వేగవంతం కానున్నాయి.

రాహుల్ గాంధీ నిరసనకు వస్తే రూ.500

ఎన్ఎస్‌యూఐ నేతపై సంచలన ఆరోపణలు!

న్యూదిల్లీ, నవంబర్ 11 (చురకలు): కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) నేత అనస్ ఖాన్‌పై తీవ్రమైన సంచలన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన "సేవ్ డెమోక్రసీ మార్చ్" కార్యక్రమంలో పాల్గొంటే విద్యార్థులకు రూ. 200 నుంచి రూ. 500 వరకు చెల్లిస్తామని ఆఫర్ చేసినట్లు ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ఒక విద్యార్థిని తీవ్ర ఆరోపణలు చేసింది. ఇవే కాకుండా కాలేజ్ వాట్సాప్ గ్రూపుల్లో కొత్తగా చేరిన విద్యార్థినులను ఎన్ఆర్ఐ పెట్టుబడిదారులకు పరిచయం చేస్తామని, అందుకు ప్రతిఫలంగా నిధులు లేదా నగదు చెల్లిస్తామని అత్యంత అభ్యంతరకరమైన సందేశాలు పంపినట్లు ఆమె ఆరోపించింది. ఈ దిగ్భ్రాంతికర విషయాలను సదరు విద్యార్థిని జాతీయ మీడియాతో ప్రత్యేకంగా పంచుకుంది. రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన మార్చ్‌లో పాల్గొంటే విద్యార్థులకు నగదు చెల్లింపులతో పాటు ఉచిత భోజనం, రవాణా సౌకర్యాలు, ప్రత్యేక రిఫ్రెష్‌మెంట్లు అందిస్తామని అనస్ ఖాన్ ఆశ చూపించినట్లు సదరు విద్యార్థిని వెల్లడించింది. కొందరికి ఉచితంగా రాపిడో రైడ్లు, జొమాటో డిస్కౌంట్ ఆఫర్లు కూడా ఇస్తామని చెప్పినట్లు పేర్కొంది. అనస్ ఖాన్ సుమారు 100 మంది కాలేజీ స్టూడెంట్స్ ఈ మార్చ్‌లో పాల్గొనేలా ప్రయత్నించినట్లు ఆరోపించింది. ఇందుకోసం కాలేజీకి చెందిన వివిధ గ్రూపుల్లో నిరంతరం సందేశాలు పంపి ఒత్తిడి తెచ్చినట్లు వివరించింది. ఇదే కాకుండా అనస్ ఖాన్ కాలేజీ గ్రూపుల్లో కొత్తగా చేరిన విద్యార్థినులకు సంబంధించి అత్యంత అభ్యంతరకరమైన సందేశాలు పంపినట్లు బయటపెట్టడం సంచలనంగా మారింది. మంచి శారీరక ఆకృతి ఉన్న యువతుల్ని ఎన్ఆర్ఐ పెట్టుబడిదారులకు పరిచయం చేస్తామని, వారికి మంచి కంపెనీ ఇస్తే రూ. 10 వేల నుంచి రూ. 30 వేల వరకు ఇస్తామని మెసేజ్‌లు పంపేవాడని ఆ విద్యార్థిని ఆరోపించింది. ఈ ఆఫర్ కోసం 22 ఏళ్ల లోపు వయసు, మంచి ఫిజిక్, అందం వంటి నిబంధనలు పెట్టినట్లు స్పష్టం చేసింది. అంతేకాకుండా కొందరు యువతులకు అహ్మదాబాద్ వెళ్లేందుకు ఉచిత విమాన టికెట్లు, దిల్జిత్ దోసాంజ్ సంగీత కచేరీకి వీఐపి టికెట్లు ఇస్తామని కూడా ఆశ చూపినట్లు తెలిపింది. ఇంతటి ఘోరమైన ఆరోపణలు ఉన్నప్పటికీ అనస్ ఖాన్‌పై ఎన్ఎస్‌యూఐ సంస్థ ఎలాంటి అధికారిక చర్యలు తీసుకోలేదని కూడా సదరు విద్యార్థిని విమర్శించింది. కాలేజీ అధికారిక కార్యకలాపాల్లో అనస్ చురుగ్గా పాల్గొంటున్నప్పటికీ ఆయనను పదవి నుంచి వెంటనే తొలగించలేదని ఆరోపించింది. అయితే ఈ అంశంపై తీవ్రమైన వివాదం రాజుకోవడంతో పాటు ఒత్తిడి పెరగడంతో అనస్ ఖాన్ స్వయంగా తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపింది. ఈ తీవ్ర ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తక్షణమే స్పందించి స్పష్టత ఇవ్వాలని ఆ విద్యార్థిని డిమాండ్ చేసింది.

సోనియా గాంధీపై కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు

'అనుమానాస్పద విదేశీయురాలు' అంటూ విమర్శలు

గాంధీ కుటుంబంలోకి సోనియా ప్రవేశంపై ప్రశ్నలు



న్యూఢిల్లీ, నవంబర్ 11 (చురకలు): కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ తీవ్ర విమర్శలు చేశారు. సోనియాను 'అనుమానాస్పద విదేశీయురాలు'గా అభివర్ణిస్తూ భారత రాజకీయాల్లోకి ఆమె ప్రవేశించిన తీరుపై ప్రశ్నలు సంధించారు. సంజయ్ గాంధీ భార్య మేనకా గాంధీని కుటుంబం నుంచి బయటకు పంపించారని ఆరోపించారు. గాంధీ కుటుంబానికి సంబంధించిన ఓ పాత వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కంగనా దాన్ని షేర్ చేశారు. ఆ వీడియో సోనియా, మేనకా గాంధీల మధ్య విభేదాలను సూచిస్తోందని వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' విడుదల నేపథ్యంలో కంగనా ఈ విమర్శలు చేశారు. వైరల్ అవుతున్న పాత వీడియోలో ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, మేనకా గాంధీతో పాటు చిన్నారులైన రాహుల్, ప్రియాంక గాంధీలు కలిసి భోజనం చేస్తున్న దృశ్యాలు ఉన్నాయి. ఆ సమయంలో ఫోన్ కాల్ రావడంతో సోనియా మాట్లాడారు. అమేథీ ఉప ఎన్నికల్లో రాజీవ్ గాంధీ 2.37 లక్షల ఓట్ల ఆధిక్యంలో ఉన్నట్లు ఆ కాల్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలిసింది. ఈ దృశ్యాలపై స్పందించిన కంగనా.. వీడియో చివరి వరకు మేనకా గాంధీ అక్కడే ఉండి ఇందిరా గాంధీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. అత్త నుంచి కనీసం చిరునవ్వు లేదా ఆప్యాయతతో కూడిన చూపు కోసం ఎదురుచూస్తున్న చిన్నపిల్లలా ఆమె కనిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే ఇందిరా గాంధీ నుంచి అలాంటి స్పందన కనిపించకపోవడం బాధాకరమని అన్నారు. దేశాల్లోని ఓ కేఫ్‌లో రాజీవ్ గాంధీని కలిసినప్పటి నుంచి సోనియాతో ఆయనకు విడదీయలేని అనుబంధం ఏర్పడిందని కంగనా పేర్కొన్నారు. ఆ తర్వాత గాంధీ కుటుంబ సభ్యులంతా ఓ 'మిస్టీరియస్ ఫారిన్ నేషనల్' చుట్టూ తిరిగినట్లుగా ఉందని విమర్శించారు. ఇందిరా గాంధీ రాజకీయ శిక్షణ ఇస్తున్న సమయంలోనే సంజయ్ గాంధీ మరణించారని, భర్తను కోల్పోయిన అనంతరం మేనకను కుటుంబం నుంచి బయటకు పంపించారని ఆరోపించారు. ఆ తర్వాత కొంతకాలానికే ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు హత్యకు గురయ్యారని, చివరకు సోనియా గాంధీ ప్రభుత్వానికి నాయకత్వం వహించే స్థాయికి చేరుకున్నారని కంగనా వ్యాఖ్యానించారు. గాంధీ కుటుంబ

15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు

కుల్గామ్ సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్రదాడి!

శ్రీనగర్, నవంబర్ 11 (చురకలు): జమ్మూ కాశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో ఉన్న సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్రవాదులు పిరికిపంద చర్యకు ఒడిగట్టారు. బుధవారం (నవంబర్ 11) మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో కుల్గాంలోని మిర్ బజార్ సమీపంలో ఉన్న అఖ్రాన్ సీఆర్పీఎఫ్ క్యాంప్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు ఈ దాడులకు తెగబడ్డారు. కేవలం 15 సెకన్ల వ్యవధిలోనే దాదాపు 30 రౌండ్ల పాటు అంధాధుందగా కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయారని సీఆర్పీఎఫ్ అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ దాడికి సంబంధించిన భయాందోళన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఆకస్మిక దాడిలో క్యాంప్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన జవాన్లను రాకేష్ దాస్, సంతోష్ చంద్రు, సోమ్‌వీర్ సింగ్‌లుగా అధికారులు గుర్తించారు. వెంటనే వారిని అనంతనాగ్ జిల్లాలోని సైనిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. జవాన్ రాకేష్ దాస్‌కు



ఎడమ కాలికి గాయం కాగా, సంతోష్ చంద్రుకు పొట్ట మరియు వెన్నెముక భాగంలో గాయాలయ్యాయి. సోమ్‌వీర్ సింగ్‌కు ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. ప్రస్తుతం ముగ్గురు జవాన్లు ప్రాణపాయం నుంచి బయటపడినట్లు వైద్యులు వెల్లడించారు. దాడి జరిగిన సమయంలో జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కుల్గామ్ జిల్లాలోనే పర్యటనలో ఉన్నారు. అయితే ఆయన దాడి జరిగిన స్థలానికి చాలా దూరంలో సురక్షిత ప్రాంతంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. దాడి సమాచారం అందుకున్న వెంటనే భద్రతా దళాలు ఘటనా స్థలానికి చేరుకుని అదనపు బారికేడ్లను ఏర్పాటు చేశాయి. ఆర్మర్డ్ వాహనాల్లో అదనపు బలగాలు (రీన్‌ఫోర్స్‌మెంట్లు) అఖ్రాన్ ప్రాంతానికి చేరుకుని తీవ్ర తనిఖీలు చేపట్టాయి. అనంతరం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన భద్రతా దళాలు స్థానిక ప్రజలను ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని లౌడ్‌స్పీకర్ ద్వారా హెచ్చరిక ప్రకటనలు జారీ చేశాయి. దాడికి పాల్పడి పరారైన ఉగ్రవాదుల కోసం చుట్టుపక్కల అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు.

విజయేందర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 11, :
దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కంచర్ల విజయేందర్ గౌడ్ కుటుంబాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్ర రాజిరెడ్డి బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, రూ.5 వేలు ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ అధైర్యపడవద్దని, తామంతా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



దమ్మపేట, నవంబర్ 11, :
దమ్మపేట మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొడ్డా భాస్కర్ రావు అనారోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు మనోధైర్యం కల్పించారు.

మురసు తుఫాన్ నష్టాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలి

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే జారె, ఎంపీ రఘురామ రెడ్డి వినతి**



దమ్మపేట, నవంబర్ 11, :
మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చెరువులు, కాలువలు తదితర మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చెరువుల కట్టలు, సాగునీటి కాలువలకు తక్షణ మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పంటలు నష్టపోయిన రైతులకు, ఇబ్బందులు ఎదుర్కొంటున్న నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. నష్ట నివారణ, శాశ్వత పునరుద్ధరణ పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించి నియోజకవర్గంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వినతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలి

- **వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి**
- **చెల్లాపూర్ రైతువేదికలో సాగు భూమి సంరక్షణ, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం**



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 11, :
రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ పంట మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారి ప్రవీణ్ సూచించారు. బుధవారం చెల్లాపూర్ రైతువేదికలో సాగు భూమి సంరక్షణ, ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. యాసంగి సీజన్‌లో భూగర్భ జలాలు తగ్గడం, విద్యుత్ సమస్యలు, చెరువులు, కాలువల్లో నీటి లభ్యత లేకపోవడం వంటి కారణాలతో వరి సాగుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, పెసర, బొబ్బర్లు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. వరి పొలాల్లో దుక్కి దున్నకుండా జీరో టిల్లేజ్ విధానంలో మొక్కజొన్న సాగు చేసే పద్ధతిని వివరించారు. ఉద్యానశాఖ అధికారి రమేష్ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో మూడు ఎకరాల వరకు కూరగాయల సాగు చేయవచ్చని వివరించారు. రైతులు పంట మార్పిడిని పాటిస్తూ పండ్ల తోటలు, కూరగాయల తోటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఎండ తీవ్రత నుంచి ఉద్యాన పంటలను కాపాడుకునే పద్ధతులతో పాటు ఉద్యానశాఖ అంది స్తున్న రాయితీలను వివరించారు. ఆయిల్‌పామ్ సాగుపై మాట్లాడుతూ ఈ పంట సుమారు 30 సంవత్సరాల వరకు దిగుబడినిస్తుందని తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా మొక్కలు, బిందు సేద్య పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. మొదటి నాలుగు సంవత్సరాల్లో అంతర పంటలు సాగు చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చ న్నారు. అంతర పంటల సాగు, ఎరువుల కోసం ఎకరానికి ఏడాదికి రూ.4,200 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.22 వేలుగా ఉందని తెలిపారు. నాలుగో సంవత్సరం తర్వాత ఆయిల్‌పామ్ తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగు విధానంపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రవీణ్, ఉద్యానశాఖ అధికారి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు అనూష, ఆయిల్‌ఫెడ్ క్షేత్రస్థాయి అధికారి అరవింద్, ఏఎంసీ డైరెక్టర్ కిషన్ రెడ్డి, మల్లారెడ్డి, జీవన్ రెడ్డి, నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ కళాకారులకు సినిమా రంగంలో అవకాశం కల్పించడమే లక్ష్యం

- **సిద్దిపేటలో 'టీమ్ ఆఫ్ శివరై' సినిమా కోసం ఆడిషన్స్**
- **80 మంది కళాకారుల హాజరు**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, :
గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేక మరుగున పడుతున్న కళాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా సిద్దిపేట జిల్లా ఫిలిం టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (ఎస్‌డీఎఫ్‌టీఏఏ) ఆధ్వర్యంలో 'టీమ్ ఆఫ్ శివరై' సినిమా ఆడిషన్స్ బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా నిర్మాత తేజస్విని మాట్లాడుతూ సిద్దిపేటతో పాటు పరిసర ప్రాంతాల్లోని కళాకారులకు సినిమా రంగంలో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రాంతాల్లోనే సినిమా చిత్రీకరణ చేపడుతూ, ఇక్కడి కళాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఎంతోమంది కళాకారులకు తమ నటనా ప్రతిభను ప్రదర్శించు కోవాలనే ఆసక్తి, కలలు ఉన్నప్పటికీ సరైన వేదిక లేక గ్రామాలకే పరిమితమవు తున్నారని అసోసియేషన్ అధ్యక్షురాలు బండి సుగుణ అన్నారు. అలాంటి ప్రతిభావంతులను గుర్తించి సినిమా రంగానికి పరిచయం చేయాలనే సంకల్పంతో ఈ ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నటుడు గౌటి రాజు, నిర్మాత ఎండీ రహీం, కరటే బాలు, ప్రధాన కార్యదర్శి డాకూరి భాస్కర్ రెడ్డి, కోశాధికారి నెమలి సుభాష్, సంయుక్త కార్యదర్శులు చింతల మోజీ, ఏలుపుల భరత్, రాకేష్ గౌడ్, మహేందర్, ఎండీ సలీం, ఆసంపల్లి మాలతి, శ్వేతారెడ్డితో పాటు సుమారు 80 మంది కళాకారులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిపల్లిలో కాంగ్రెస్ వర్గపోరు.. ఫ్లెక్సీల దహనంతో కలకలం..

- **సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన ఫ్లెక్సీలకు నిప్పు.. గౌరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు..**



గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 11, :
సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేయడంతో రాజకీయ కలకలం రేగింది. గ్రామ సర్పంచ్ భర్త దాసరి యాదగిరి, అతని అనుచరులే కారులో పెట్రోల్ తీసుకొచ్చి ఫ్లెక్సీలను తగులబెట్టారని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి వర్గీయులు ఆరోపించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అనుచరులపై ఆరోపణలు చేస్తూ గౌరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనతో వర్గల్ మండల కాంగ్రెస్‌లో చాలాకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల మధ్య ఇలాంటి గొడవలు చోటుచేసుకోవడం పార్టీకి నష్టం కలిగిస్తుందని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ పెద్దలు తక్షణమే స్పందించి విచారణ జరిపించాలని, పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలకు న్యాయం చేయడంతో పాటు పార్టీ ఐక్యతను కాపాడాలని జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, ఇతర కార్యకర్తలు కోరుతున్నారు. కాగా, ఘటన విషయం తెలుసుకున్న చిటుకుల మహిపాల్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ఫ్లెక్సీలను దహనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు. పోలీసుల విచారణలో ఈ ఘటనకు సంబంధించి వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

- **మైనార్టీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు.. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ..**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, :
భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలను సిద్దిపేట పట్టణంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల నంబర్-2లో జిల్లా మైనార్టీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్ రాషద్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, దేశ విద్యావ్యవస్థకు బలమైన పునాదులు వేశారని తెలిపారు. ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి విశేష కృషి చేశారని, విద్యా సంస్కరణలకు ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా దేశానికి, పార్టీకి విశేష సేవలందించారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని రాషద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అతీఫ్, మాజీ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అస్మత్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్, మైనార్టీ విభాగం నాయకులు ఫిరోజ్, ఫారూఖ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- **నాగదేవత ఆలయం నుంచి రింగ్‌రోడ్డు వరకు అభివృద్ధి పనులపై కలెక్టర్, పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, :
ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహణ కోసం ఎంపిక చేసిన నాగదేవత ఆలయం నుంచి రింగ్‌రోడ్డు ప్రాంతం వరకు కొనసాగుతున్న పనులను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్, ఆర్డీవో సదానందం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం పరిసరాల్లో చేపడుతున్న ఏర్పాట్లు, రహదారుల పనులు, ఇతర మౌలిక సదుపాయాల పురోగతిని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రజలకు, సభకు హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టడంపై అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం కావడంతో పాటు భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఈ పరిశీలనలో పోలీస్, రెవెన్యూ శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

- పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు వెంటనే చెల్లించాలి
- లేకుంటే కుటుంబాలతో కలిసి సీఎం ఇంటి వరకు పాదయాత్ర

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, :

ప్రభుత్వాలు మారుతున్నా ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని పలు ప్రాజెక్టుల భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న తమకు రావాల్సిన నష్టపరిహారం, పునరావాస ప్యాకేజీలను తక్షణమే చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్, అంతగిరి, గౌరవెల్లి ప్రాజెక్టుల భూ నిర్వాసితులు తమ సమస్యలను వెల్లడించారు. 2016లో నిర్వహించిన దీక్ష సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమ సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న ఆయన స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జీవో నంబర్ 123 ద్వారా తమ భూములను బలవంతంగా సేకరించారని, అయితే ఇప్పటికీ పలువురికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని ఆరోపించారు. ప్రాజెక్టులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా అర్హులైన అనేకమంది నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు అందకపోవడం దురదృష్టకరమన్నారు. అధికారులకు పలుమార్లు వినతులు సమర్పించినా, న్యాయస్థానాలను ఆశ్రయించినా తమ సమస్యలకు పరిష్కారం లభించడం లేదని వాపోయారు. రాజకీయ పలుకుబడి



ఉన్నవారికి భూములు, ఇళ్లు కేటాయిస్తూ, అర్హులైన అసలైన భూ నిర్వాసితులను విస్మరిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అంతకంటే ముందే తమకు రావాల్సిన నష్టపరిహారం చెల్లించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే కుటుంబాలతో కలిసి పాదయాత్రగా ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటామని హెచ్చరించారు. భూములు కోల్పోయిన తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భూ నిర్వాసితులు ఎండీ హయతుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, పోచయ్య, ప్రవీణ్, బాబు, ప్రభాకర్, ఎల్లారెడ్డి, ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరణ్ మృతిపై వారమైనా చర్యలు శూన్యం

- సిద్దిపేట డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలి
- బాధ్యుడైన ఉపాధ్యాయుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- విద్యాశాఖ తీరుపై యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడికందుల రవి ఆగ్రహం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, :

గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ బీసీ వసతి గృహ విద్యార్థి చరణ్ మృతికి సంబంధించి వారం రోజులు గడుస్తున్నా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై



యూఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి గుడికందుల రవి బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడి వేధింపుల కారణంగానే చరణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపణలు వస్తున్నప్పటికీ, సంబంధిత గణిత ఉపాధ్యాయుడు మహిపాల్ రెడ్డిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. విద్యారంగ సమస్యలపై ఎన్నిసార్లు సంప్రదించినా కార్యాలయంలో అందుబాటులో ఉండకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)ను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతిపై వారం రోజులైనా చర్యలు లేకపోవడం వెనుక ఉన్న కారణాలేంటో విద్యాశాఖ స్పష్టం చేయాలని కోరారు. చరణ్ మృతికి కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు మహిపాల్ రెడ్డిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థి మృతికి బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోమని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, జిల్లావ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని గుడికందుల రవి హెచ్చరించారు.

రైతులకు అందుబాటులోకి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి
- ఏఎంసీ చైర్ పర్సన్ సంయుక్త శ్రీధర్

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 11, :

రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సంయుక్త శ్రీధర్ అన్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు రవాణా, విక్రయాల పరంగా ఇబ్బందులు కలగకుండా ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనకయ్య, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పలువురు రైతులు,



స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతర కృషి

- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 11, :

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లో ఉన్న తన కార్యాలయంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శాలువాలతో సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని పలు శుభకార్యాలు, అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలకు హాజరుకావాలని పలువురు ఆహ్వానించారు.



అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 11, :

తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో చిక్కుడు నర్సింలు, చిక్కుడు రాజవ్వ ఇల్లు దగ్ధమై బాధిత కుటుంబాలకు తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదం జరిగిన తీరును, జరిగిన నష్టాన్ని బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలు అధైర్యపడవద్దని భరోసా కల్పిస్తూ, వారికి ఆర్థిక సహాయం అందించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతేకాకుండా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున అందించే సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం



అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలు తిరిగి కోలుకునేలా అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాస్తి కళావతి స్వామి, మండల పార్టీ అధ్యక్షులు పంది రాజు, ఉపాధ్యక్షులు చిక్కుడు ఉప్పలయ్య గ్రామ పార్టీ అధ్యక్షులు బరెంకల స్వామి, నాయకులు వెంకటేశం, బండారు రమేష్ గౌడ్, రాములు, అర్జున్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణరక్షణ సేవలకు ప్రశంసాపత్రం

దమ్మపేట ఫైర్ ఫైటర్ తోట చెన్నారావుకు అరుదైన గుర్తింపు

దమ్మపేట, నవంబర్ 11, :



ఆపద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణరక్షణ సేవలు అందించిన దమ్మపేటకు చెందిన ఫైర్ ఫైటర్ తోట చెన్నారావు కు ఉన్నతాధికారుల ప్రశంసలు లభించాయి. సత్తుపల్లి మండలం బేతపల్లి చెరువు వద్ద జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. విధి నిర్వహణలో చూపిన చొరవ, సమయస్ఫూర్తితో బాధితులను కాపాడిన సేవలను గుర్తించిన ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్ ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు. ప్రాణరక్షణలో విశేష సేవలందించిన చెన్నారావుకు ఉన్నతాధికారుల నుంచి గుర్తింపు లభించడంపై దమ్మపేట ప్రాంత ప్రజలు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రాజనోళ్ల లక్ష్మి నియామకం

- కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన లక్ష్మి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 11, :

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన రాజనోళ్ల లక్ష్మి బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి రాజనోళ్ల లక్ష్మి కి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మహిళా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన రాజనోళ్ల లక్ష్మి

- టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన లక్ష్మి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 11, :

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన రాజనోళ్ల లక్ష్మి బుధవారం టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డితో ఆమె కొద్దిసేపు మాట్లాడి, జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. మహిళా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

డంపింగ్ యార్డ్, స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలపై కొలన్ హన్మంత్ రెడ్డికి వినతిపత్రం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 11, :

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని డంపింగ్ యార్డ్, స్వచ్ఛ ఆటో యూనియన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు తమకు ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను సావధానంగా విన్న కొలన్ హన్మంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజేందర్, గణేష్, మోహన్ గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి..

- గ్రంథాలయాల ఏర్పాటుతోనే విజ్ఞాన వికాసం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 11, :జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 132వ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే విలువైన విద్యా భాండాగారాలని పేర్కొన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుతో విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత దోహదం కలుగుతుందని తెలిపారు. చదువుపై ఆసక్తి ఉన్నప్పటికీ పేదరికం కారణంగా విద్యకు దూరమవుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. విద్య ఆవశ్యకతను వారి తల్లిదండ్రులకు వివరించి, విద్యార్థులు తమ చదువును నిరంతరంగా కొనసాగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో తన సొంత నిధులతో ఇంటర్మీడియట్, ఒకేషనల్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ అవకాశాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ వసుంధర, పాఠశాల ప్రిన్సిపాల్ కమల్ సింగ్, స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం.. రైతు కల్లాల్లో రాజకీయాలు వద్దు..

- రైతులకు క్వింటాల్‌కు అదనంగా రూ.20 ఉచితంగా సుతిలి అందజేత
- మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

చిన్నకోడూరు, నవంబర్ 11, :

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అదనపు ప్రయోజనాలు కల్పిస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు. క్వింటాల్ ధాన్యానికి అదనంగా రూ.20 చెల్లించడంతో పాటు, ధాన్యం బస్తాలు కుట్టేందుకు అవసరమైన సుతిలిని కూడా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. చిన్నకోడూరు మండల పరిధిలోని కమ్మర్‌పల్లి, మైలారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా రైతుల కల్లాల్లో రాజకీయాలు చేయవద్దని, కొనుగోలు కేంద్రాలను రాజకీయాలకు వేదికగా మార్చకుండా అన్ని పార్టీల నాయకులు రైతులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు నముండ్ల సరిత హరీష్, రెగుల శ్యామల దేవయ్య, ఉప సర్పంచులు కప్పేరా రాజు రెడ్డి, మమత శ్రీధర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాల్వ జగన్, జక్కుల నాగరాజు, రైతులు ముక్కెర శ్రీనివాస్, ఇస్కిల్ల పరశురాం, నాగపూరి హన్మయ్య, నాయకులు సందబోయిన పరశురాం, నముండ్ల సంజీవ్, వడ్లూరి అశోక్, అరవింద్, అంజనేయులు, వార్డు సభ్యులు పసుపుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నేతలకు దుబ్బాకలో కరువు కనిపించడం లేదా

- సీఎం రేవంత్ రెడ్డి స్పందించి రైతులను ఆదుకోవాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక ప్రతినిధి (తొగుట), నవంబర్ 11, :

దుబ్బాక నియోజకవర్గంలో కరువు పరిస్థితులు తీవ్రరూపం దాల్చుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు కనిపించడం లేదా అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. ఒకవైపు ఎండిపోతున్న పంట పొలాలు, మరోవైపు అడుగంటుతున్న భూగర్భ జలాలు, ఇంకోవైపు రబీ సాగుపై నెలకొన్న అనిశ్చితితో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే పరిమితమైందని విమర్శించారు. బుధవారం తొగుట మండలంలోని వెంకట్రావుపేట, జప్తిలింగారెడ్డిపల్లి, చందాపూర్, పెద్దమాసాన్‌పల్లి, బండారుపల్లి, ఘనపూర్, గుడికందుల, గోవర్ధనగిరి గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు రబీ పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు.

మల్లన్నసాగర్‌లో గోదావరి జలాలు ఉంటే ఈ కరువు ఎందుకు వస్తుంది

వేల కోట్ల రూపాయలతో నిర్మించిన మల్లన్నసాగర్ ప్రాజెక్టులో గోదావరి జలాలను నింపకుండా రైతులకు సాగునీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. రాజకీయ కక్షలు, విమర్శలను పక్కనపెట్టి మల్లన్న సాగర్‌ను గోదావరి జలాలతో నింపి, ఉపకాలువల నిర్మాణం చేపడితే దుబ్బాక రైతులకు రబీ సాగుపై భరోసా లభించేదన్నారు. గతంలో రైతుల ప్రయోజనాల కోసం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్లే నేడు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు.

కరువు మండలాలుగా ప్రకటించడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి అభ్యంతర మేంటి

గతంలో కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు దుబ్బాక నియోజకవర్గంలోని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం అంతకంటే దారుణమైన పరిస్థితులు నెలకొన్నా ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కరువు మండలాలుగా ప్రకటిస్తే రైతులకు ఆర్థిక సహాయం, పంట రుణాల రీషెడ్యూల్, పశుసంపద పరిరక్షణతో పాటు సాగుకు అవసరమైన ప్రోత్సాహకాలు అందే అవకాశం ఉంటుందని తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి దుబ్బాక రైతులకు సమాధానం చెప్పాలి

ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుబ్బాక నియోజకవర్గ రైతుల సమస్యలపై స్పందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, మల్లన్నసాగర్‌లో గోదావరి జలాలను నింపాలని, ఉపకాలువల నిర్మాణం చేపట్టాలని, గతంలో రద్దు చేసిన నిధులను తిరిగి మంజూరు చేయాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ.. బాధితులకు భరోసా..

అనంతరం చందాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ గుడ్డోజి కవిత ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెద్దమాసాన్‌పల్లికి చెందిన సీనియర్ నాయకుడు జయరాంరెడ్డి రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గుడికందుల గ్రామంలో ఇటీవల మృతి చెందిన సర్వయ్యగారి ఎల్లారెడ్డి, మట్ట వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 11, :

భారత స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న పురస్కార గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమదుర్గ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ మైనారిటీ వర్కింగ్ చైర్మన్ షేక్ నవాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి పటిష్టమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. దేశ సమైక్యత, మత సామరస్యం, విద్యా ప్రగతి కోసం ఆయన చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమానత్వం, సోదరభావం, విద్యాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాలి బాలాజీ, లక్ష్మయ్య, పుష్పారెడ్డి, పాషా, సల్మాన్, లక్ష్మణ్ గౌడ్, జమీర్, ఎజాజ్, రమణ, మస్కుదలి, ప్రసన్నకుమార్, కిట్టు, సుధాకర్, ప్రకాష్, ముదిరాజ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం

- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక ప్రతినిధి (తొగుట), నవంబర్ 11, :

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తొగుట మండలంలోని తొగుట, తుక్కాపూర్, ఎల్లారెడ్డిపేట, లింగాపూర్, వరదరాజుపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, అన్నదాతల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పంది రాజు, మార్కెట్ వైస్ చైర్మన్ కొంగరీ నర్సింలు సర్పంచుల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య సర్పంచ్ లు శోభ కొండల్ రెడ్డి, లత నరేందర్ రెడ్డి, రాంపురం రమేష్ , మాస్టి కళావతి స్వామి, గొడుగు జయమ్మ నర్సింలు, గోపాల్ రెడ్డి, డైరెక్టర్ లు చందా సత్తయ్య, నరసింహ రెడ్డి, భైతి స్వామి, రాజప్ప రాములు, పాక్స్ డైరెక్టర్ లు నారాయణ రెడ్డి, నాయకులు చిక్కుడు ఉప్పలయ్య, పబ్బతి మల్లారెడ్డి, నిరంజన్ రెడ్డి, భరత్, బండారు రమేష్ గౌడ్, బరెంకల స్వామి, చెట్టి శ్రీను, దేవునూరి పోచయ్య, చందు, అనుముల స్వామి, అర్జున్, ఫరీద్, ఏపీఎం బాబురావు, ఏఓ మోహన్, ఏఈవో లు, సెక్రటరీలు, సీసీలు, సీఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



హన్నిస్ డిజైనర్ స్టూడియో వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 11, :

కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో కొడవల్లి గోవర్ధని ఆహ్వానం మేరకు నిర్వహించిన హన్నిస్ డిజైనర్ స్టూడియో 9వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం జరిగిన వేడుకలకు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టూడియో నిర్వాహకులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సంస్థ మరింత అభివృద్ధి సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, అరవింద్ రెడ్డి, రాజేష్, గౌడ్ శ్రీనివాసబాబు, సాయిబాబా చౌదరి, బాబ్జి, చావా శ్రీనివాస్, రామారావు, రమణ, నలినీకాంత్, కళ్యాణ్, రవి, బొచ్చు మల్లీ, ఆవుల వేణు, సంధ్య, వాణి, సుజాత, సరోజ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ..

దమ్మపేట, నవంబర్ 11, :


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి మంజూరు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని భరోసా కల్పించారు. ఈ మేరకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో నెలకొన్న సమస్యలను, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గం భౌగోళికంగా విస్తరించి ఉండటంతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అదనపు నిధుల అవసరం ఉందని వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న చిరకాల సమస్యల పరిష్కారంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల్లో గ్రామీణ రహదారుల నిర్మాణం, దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాల కల్పనతో పాటు విద్య, వైద్య రంగాల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా గిరిజన, మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రభుత్వ మౌలిక సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం వంటి అంశాలను ప్రస్తావించారు.

ముఖ్యమంత్రి సానుకూల హామీ

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అందించిన వినతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, అవసరమైన నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ భేటీలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు పాల్గొన్నారు.



జిల్లావ్యాప్తంగా ఒకే రోజు 302 సీసీటీవీ కెమెరాల ప్రారంభం





- 'సిద్దిపేట సురక్ష నేత్ర'తో గ్రామాలకు భద్రతా కవచం
- సైబర్ నేరాలు, ఉద్యోగ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, :

జిల్లాలో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు చేపట్టిన 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఒకే రోజు జిల్లా వ్యాప్తంగా 302 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలను ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారుల సమక్షంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా కొండపాక మండలం మర్పడగ గ్రామంలో గ్రామ పంచాయతీ సహకారంతో ఏర్పాటు చేసిన 40 కెమెరాలను, మద్దూరు మండలం బైరాన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన 30 కెమెరాలను పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సీసీటీవీ కెమెరాలు నేరాల నియంత్రణకు, నేరాలు జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాల్లో 24 గంటల పాటు నిఘా ఉండటం వల్ల ప్రజలకు అదనపు భద్రత కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా నిర్వహించడం కూడా ముఖ్యమన్నారు. కెమెరాల నిర్వహణ కోసం సంబంధిత సంస్థలతో రెండు నుంచి మూడేళ్ల పాటు సేవా ఒప్పందం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాలకు పంపిస్తామని డబ్బులు అడిగే దళారులను నమ్మవద్దని హెచ్చరించారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరి వ్యక్తిగత, ఆర్థిక సమాచారం మొబైల్ ఫోన్లలో ఉంటోందని, అందువల్ల బ్యాంకు పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లను ఫోన్లలో భద్రపరచవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఫోన్ చేసి ఓటీపీ, పిన్ నంబర్లు అడగరని తెలిపారు. అపరిచితులు పంపే లింకులను తెరవవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, గ్రామ ప్రజలను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇతర గ్రామాలు కూడా ఈ గ్రామాలను ఆదర్శంగా తీసుకుని స్వచ్ఛందంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పోలీస్ స్టేషన్ల వారీగా కెమెరాల వివరాలు

సిద్దిపేట వన్ టౌన్, హౌసింగ్ బోర్డు కాలనీ.. 6. సిద్దిపేట టూ టౌన్, నెహ్రూ పార్క్.. 24. సిద్దిపేట త్రీ టౌన్, మర్పడగ.. 40, అంకిరెడ్డిపల్లి.. 12. గజ్వేల్ టౌన్, 10. సిద్దిపేట రూరల్, తోర్నాల.. 12. చిన్నకోడూరు, మెట్టుపల్లి.. 10. బెజ్జంకి, గాగిల్లాపూర్..10. దుబ్బాక, అప్పనపల్లి.. 10, పద్మనాభునిపల్లి.. 10, రజాక్కపేట.. 12, బల్వంతాపూర్.. 2. అక్బర్ పేట భూంపల్లి, ఎనగుర్తి.. 12. జగదేవ్‌పూర్, తిగుల్ నర్సాపూర్.. 8. మర్కుక్, కాశిరెడ్డిపల్లి.. 5. గౌరారం, అనంతగిరిపల్లి.. 10. తొగుట, చందాపూర్.. 8. దౌల్తాబాద్, సూరంపల్లి.. 6. కుకునూరుపల్లి, వెలికట్ట.. 23. బేగంపేట, నెమ్మూర్.. 14. హుస్నాబాద్, రాములపల్లి.. 7. కోహెడ, పోరెడ్డిపల్లి..10. చేర్యాల, దానంపల్లి.. 4, చిట్యాల.. 7. మద్దూరు, బైరాన్‌పల్లి.. 30. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, త్రీ టౌన్ సీఐ లక్ష్మీబాబు, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, చేర్యాల సీఐ రమేష్, మద్దూరు ఎస్సై ఆసిఫ్, కొమురవెల్లి ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల సమస్యలపై కదిలిన అధికారులు!

- ఎంపీ ఈటల రాజేందర్ స్పందనతో క్షేత్రస్థాయిలో పరిశీలన – మరమ్మతులకు హామీ

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 11, :రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన బీజేపీ డివిజన్ మాజీ అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పరిష వేణు ఇటీవల మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలపై స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ పాఠశాలలో అవసరమైన మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో స్పందించిన మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి, కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారిణి జెమిని కుమారి మంగళవారం పాఠశాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికల టాయిలెట్ల సమస్య, భవన గోడలకు ఏర్పడిన పగుళ్లు, బీటలు, ఇతర మరమ్మతుల అవసరాలపై ప్రధానోపాధ్యాయురాలితో పాటు పరిష వేణును అడిగి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలోని సమస్యలను పరిశీలించిన అధికారులు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల ఇబ్బందులను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి, అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనకు చొరవ చూపిన పరిష వేణుకు విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.



రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దు
- సన్న వడ్లకు రూ.500 బోనస్ వర్తిస్తుంది

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 11, :

రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి బుధవారం సూచించారు. రైతులకు ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా, పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించాలని, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. రైతులకు అవసరమైన సహకారం అందించాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించిన అనంతరం అధికారులు ఆన్‌లైన్ ట్యాబ్‌లో లేదా ట్రక్ షీట్‌లో సంబంధిత వివరాలను నమోదు చేస్తారని పేర్కొన్నారు. ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధర, బోనస్ మొత్తాలను విడివిడిగా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని వివరించారు. కావున రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి, ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటు వర్తించే బోనస్‌ను పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొంగరం బాల్ రెడ్డి, డైరెక్టర్లు, ఆకుల భరత్, కడుదురి నరేందర్ రెడ్డి, మెట్ల సంజీవ్, చర్లపల్లి బాల్ రెడ్డి, పర్స నర్సింలు, మహమ్మద్ అజీజ్, దుబ్బాక మున్సిపల్ కౌన్సిలర్లు, శ్రీరామ్ సరస్వతి నరేందర్, ఐరేని అఖిల సాయి తేజ గౌడ్, తునికి సురేష్, నాయకులు కొండె స్వామి రెడ్డి, శ్రీనివాస్, చారి తదితరులు పాల్గొన్నారు.



తమ్మిడికుంట చెరువుకు పూర్వ వైభవం తీసుకొచ్చాం



- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 11, :

మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో ఉన్న తమ్మిడికుంట చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో, బుధవారం చెరువు పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నానని, తన తరపున, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. తమ్మిడికుంట చెరువు దశ దిశ మారిందని, చెరువు ఆక్రమణలను తొలగించి పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలు చేపట్టామని తెలిపారు. చెరువు పరిధిలో జరిగిన కబ్జాలు, అక్రమ నిర్మాణాలను తొలగించి పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. కుంచించుకుపోయిన చెరువు విస్తీర్ణాన్ని కాపాడటంతో పాటు నాలాల పునరుద్ధరణ, సుందరీకరణ పనులను పూర్తి చేశామని తెలిపారు.చెరువును అన్ని హంగులతో అభివృద్ధి చేసి సుందర శోభిత వనంగా తీర్చిదిద్దామని, నేటి నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని గాంధీ తెలిపారు. దీనివల్ల పరిసర ప్రాంత ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, మాదాపూర్ శ్రీనివాస్, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

40 మంది ఉద్యోగులు బకాయిలు అందకుండానే మృతి చెందడం బాధాకరం!

- హెచ్‌ఎంటీ రిటైర్డ్ ఉద్యోగుల పోరాటానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంఘీభావం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 11, :హెచ్‌ఎంటీ రిటైర్డ్ ఉద్యోగుల న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం చేపట్టిన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్పష్టం చేశారు. పీఎఫ్, గ్రాట్యుటీ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి న్యాయబద్ధమైన బకాయిల చెల్లింపుల్లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ హెచ్‌ఎంటీ మిషన్ టూల్స్ కంపెనీ (ఎంటీహెచ్, పీటీఎచ్ యూనిట్స్) రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం-18/23 ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హెచ్‌ఎంటీలో 35 నుంచి 40 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం సేవలందించి



పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చట్టబద్ధంగా అందాల్సిన పీఎఫ్, గ్రాట్యుటీ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ చెల్లించకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగా పదవీ విరమణ అనంతరం ప్రశాంతంగా జీవించాల్సిన ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లను ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 2023లో హెచ్‌ఎంటీని సందర్శించిన కేంద్ర మంత్రి కుమారస్వామితో సైతం ఈ సమస్యపై చర్చించామని, రెండు నెలల్లో ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ అమలు కాకపోవడం విచారకరమన్నారు. ముఖ్యంగా, దాదాపు 40 మంది రిటైర్డ్ ఉద్యోగులు తమ జీవితకాల కష్టార్జితానికి సంబంధించిన న్యాయబద్ధమైన బకాయిలు అందకుండానే మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా జేఏసీగా ఏర్పడి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులకు న్యాయంగా దక్కాల్సిన ప్రతి హక్కును సాధించుకునే వరకు వారి పక్షాన తన మద్దతు, సహకారం ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు బీఎన్. మధుకృష్ణ, నారాయణరెడ్డి, ఆర్. మహేందర్, రాములుగౌడ్, రవీందర్, బీఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంటీ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

- కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలి – మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 11, :హెచ్‌ఎంటీ సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులు బుధవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎంటీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి హెచ్‌ఎంటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాజరై రిటైర్డ్ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్లుగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగుల సమస్యపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిలను వెంటనే విడుదల చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ఈ సమస్యను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పార్లమెంట్‌లో ప్రస్తావించి, ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఎంటీకి చెందిన విలువైన భూములు అన్యాక్రాంతమవుతూ, కబ్జాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత హెచ్‌ఎంటీ యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంటీ రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీ సభ్యులు జీవీ నారాయణరెడ్డి, రాములు, మధుకృష్ణ, రవీందర్, యాదగిరి, కుమారస్వామి, మహేందర్, మాల్యాద్రితో పాటు పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



డీసిసి అధ్యక్షుడిని కలిసిన జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

- శాలువాతో సన్మానించిన ఆడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, :

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసిసి) అధ్యక్షుడు గాజంగి నందయ్యను బుధవారం జగిత్యాలలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అడువాల జ్యోతి లక్ష్మణ్. ఈ సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మహిళా కాంగ్రెస్ అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు చర్చించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తామని అడువాల జ్యోతి లక్ష్మణ్ తెలిపారు.



ఇందిరమ్మ ఇంట్లోకి అడుగుపెట్టిన చంద్రయ్య కుటుంబం

- మెలిగిరిపేటలో ఘనంగా గృహప్రవేశ వేడుక
- కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ షాబుద్దీన్



సదాశివపేట, నవంబర్, 11,:

సదాశివపేట మండలం మెలిగిరిపేట గ్రామంలో బుధవారం నాడు మంగలి చంద్రయ్య నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహంలోకి అడుగుపెట్టిన చంద్రయ్య కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. నూతన గృహంలో చంద్రయ్య కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం సర్పంచ్ షాబుద్దీన్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, బంధుమిత్రులు పాల్గొని చంద్రయ్య కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

రైతులకు అండగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



మానకొండూర్ ప్రతినిధి, నవంబర్ 11, :

రైతులకు అండగా నిలుస్తూ, వారు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్, దేవంపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊటూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో లక్ష్మీపూర్‌లో, దేవంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో దేవంపల్లి, పచ్చునూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఊటూరు, దేవంపల్లి, మానకొండూర్ పీఏసీఎస్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, నాగిశెట్టి రాజయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్లు బొంగోని కనకయ్య, వరహాలచారి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, బుర్ర శ్రీధర్, ఎడ్ల శ్రీధర్, కనకం అశోక్, తమిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి మండల ఉపాధ్యక్షుడిగా కాసారపు నర్సయ్య గౌడ్



చొప్పదండి/కొడిమ్యాల, నవంబర్ 11, :

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కాసారపు నర్సయ్య గౌడ్ ని మండల ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు బండ నరసింహారెడ్డి నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నూతన మండల ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ కార్యకర్తగా బిజెపిలో అన్ని కార్యక్రమాల్లో అభిమానంతో పని చేస్తున్న నన్ను గమనించి కొడిమ్యాల మండల బిజెపి ఉపాధ్యక్షుడిగా నియమించిన మండల అధ్యక్షుడు బండ నరసింహారెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, ప్రతి బిజెపి కార్యకర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది కేవలం ఒక పదవి కాదని, బిజెపి కుటుంబం నాపై ఉంచిన నమ్మకానికి గుర్తింపు, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో పార్టీ బలోపేతానికి, కార్యకర్తల గౌరవానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడతానని, ప్రతి కార్యకర్త నా బలం, బిజెపి జెండా నా బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవుడి మాన్యానికీ కబ్జా కోరల ముప్పు

- సిద్దిపేటలో వెంకటేశ్వర స్వామి ఆలయానికి కేటాయించిన ఐదు ఎకరాల భూమిపై వివాదం
- ఆలయ భూములను కాపాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆలయాల పరిరక్షణ సమితి నాయకుల ఫిర్యాదు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 11, :

దేవుడి భూములకూ కబ్జా కోరల ముప్పు తప్పడం లేదు. సిద్దిపేట పట్టణంలోని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి కేటాయించిన ఐదు ఎకరాల మాన్యం భూమి అన్యాక్రాంత మవుతోందని ఆలయాల పరిరక్షణ సమితి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయానికి చెందిన విలువైన భూమిని పరిరక్షించి, దేవాలయ అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాల పరిరక్షణ సమితి నాయకులు జిల్లా శ్రీనివాస్, ఉడుత మల్లేశం, పాసికంటి సత్యం మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి 1340 సర్వే నంబరులో ఐదు ఎకరాల భూమిని ఉద్యానవనం కోసం కేటాయించారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ భూమి కొందరి కబ్జా ప్రయత్నాలతో వివాదంలో చిక్కుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయానికి చెందిన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, భూకబ్జాదారుల నుంచి దేవుడి మాన్యాన్ని రక్షించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వామివారి భూములను అన్యాక్రాంతం చేసిన వారు ఎంతటివారైనా, ఏ రాజకీయ పార్టీకి చెందినవారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేసినట్లు నాయకులు వెల్లడించారు. 1340 సర్వే నంబరులోని ఐదు ఎకరాల భూమికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. మూడు రోజుల్లోగా పూర్తి వివరాలతో నివేదిక అందించాలని సంబంధిత జిల్లా అధికారులకు మంత్రి సూచించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ, దేవాదాయ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు ఎవరైనా అక్రమాలకు సహకరించినట్లు తేలితే వారిపై శాఖాపరమైన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించినట్లు తెలిపారు. దేవుడి భూములకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఐదు ఎకరాల మాన్యం భూమి వ్యవహారంలో అధికారుల విచారణతో అసలు నిజాలు వెలుగులోకి వస్తాయా? భూకబ్జా ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

బాచుపల్లి శివాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన బిక్ష ప్రారంభం

- తొలి రోజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 11, :అయ్యప్ప స్వాముల సేవే పరమావధిగా భావిస్తూ బాచుపల్లి శివాలయం ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి సన్నిధానంలో అన్నదాన బిక్ష కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమంలో భాగంగా తొలి రోజు అయ్యప్ప స్వాములకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ అన్నదాన బిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి, అయ్యప్ప స్వాములకు స్వయంగా భోజనం వడ్డించారు. అయ్యప్ప దీక్షా కాలమంతా ప్రతిరోజూ స్వాములకు మధ్యాహ్న బిక్ష అందించాలనే సదుద్దేశంతో ఆగం పాండు ముదిరాజ్ ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూ, అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు సన్నిధానంలో ఆశ్రయం కల్పించడంతో పాటు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఆయన అందిస్తున్న సేవలు భక్తుల ప్రశంసలు అందుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

తండ్రి బాటలో తనయుడు..

తండ్రి అడుగుజాడల్లో తనయుడు అన్నట్లుగా ఆగం పాండు ముదిరాజ్ కుమారుడు ఆగం కిరణ్ కుమార్ ఈ ఏడాది తొలిసారిగా అయ్యప్ప మాలధారణ చేసి కన్యాస్వామిగా దీక్ష చేపట్టారు. కుటుంబ సభ్యులంతా భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వాముల సేవలో భాగస్వాములు కావడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయ్యప్ప స్వాముల దీక్షా కాలమంతా బాచుపల్లి శివాలయంలోని అయ్యప్ప సన్నిధానంలో ప్రతిరోజూ అన్నదాన బిక్ష కార్యక్రమం కొనసాగనుంది. ఈ సేవా కార్యక్రమంపై అయ్యప్ప స్వాములు హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాల స్థలం విద్యాశాఖకు బదిలీ కావడం ప్రజల సమిష్టి విజయం

- మీడియా మిత్రులకు, కేపీహెచ్‌బీ ప్రజలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృతజ్ఞతలు



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 11, :

కేపీహెచ్‌బీ హౌసింగ్ బోర్డు పరిధిలోని రమ్యా గ్రౌండ్స్ వద్ద ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం కేటాయించిన 2.39 ఎకరాల స్థలాన్ని విద్యాశాఖకు బదిలీ చేయడం పట్ల కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించిన ఆయన, మీడియా మిత్రులకు, కేపీహెచ్‌బీ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ విజయం ఏ ఒక్కరిదో కాదని, ప్రజలందరి సమిష్టి పోరాట ఫలితమని అన్నారు. సుమారు నాలుగు సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి పునాదులు వేసి పనులు ప్రారంభించామని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హౌసింగ్ బోర్డు స్థలాల పేరుతో ఈ భూమిని విక్రయించేందుకు ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. విలువైన ప్రభుత్వ భూమిని కాపాడేందుకు ప్రజలతో కలిసి అనేక పోరాటాలు చేశామని, ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. ఈ పోరాటంలో మీడియా మిత్రులు తమ వార్తా కథనాల ద్వారా సమస్యను ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రజా ఉద్యమానికి ఎంతో మద్దతుగా నిలిచారని కొనియాడారు. ప్రజలు, స్థానిక నాయకులు, మీడియా మిత్రుల సమిష్టి కృషి వల్లే నేడు ఈ స్థలం విద్యాశాఖకు బదిలీ అయిందని అన్నారు. త్వరలోనే ఈ స్థలంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులు చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. కూకట్‌పల్లి, మూసాపేట ప్రాంతాల్లో మిగిలి ఉన్న ప్రభుత్వ భూములను కూడా విక్రయించకుండా ప్రజా అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ భూములను కాపాడుకోవడం భవిష్యత్తు తరాల ప్రయోజనాల దృష్ట్యా ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ ప్రజలకు, స్థానిక నాయకులకు, మీడియా మిత్రులకు, స్థలాన్ని విద్యాశాఖకు బదిలీ చేసిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనో చౌదరికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, పగడాల బాబురావు, కృష్ణారెడ్డి, ప్రభాకర్, రాజేష్ రాయి, గోపి, శివారెడ్డి, ఉపేంద్ర రెడ్డి, వెంకట్ రెడ్డి, వలవల నాయుడు, తిరుపతి శ్రీనివాస రెడ్డి, తులసిరెడ్డి, నర్సింగ్ రావు, రామకృష్ణ, సాంబశివరావు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, లత, పద్మ, బేగం, వరలక్ష్మి , బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ట్రక్ పార్క్ భూముల విక్రయాన్ని అడ్డుకుంటాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అసోసియేషన్ సభ్యుల వినతి



కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 11, :

కూకట్‌పల్లిలోని ట్రక్ పార్క్ స్థలాన్ని విక్రయించకుండా కాపాడాలని కోరుతూ కూకట్‌పల్లి, మూసాపేట ప్రాంతాలకు చెందిన వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి భవిష్యత్తు అవసరాలకు ట్రక్ పార్క్ స్థలం ఎంతో కీలకమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంత జనాభా సుమారు 25 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని, ఇప్పటికే హైరైజ్ భవనాల నిర్మాణంతో జనాభా వేగంగా పెరుగుతోందని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి అవసరాలు తీర్చేందుకు వాటర్ ట్యాంకులు, క్రీడా మైదానాలు, పార్కులు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ప్రజా అవసరాలకు ఉపయోగపడే ఏకైక విశాలమైన స్థలం ట్రక్ పార్క్ అని వివరించారు. బుధవారం తనను కలిసిన అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే విలువైన స్థలాన్ని విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయుడు, కిరణ్ కుమార్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వాల వరకు, అలాగే కేసీఆర్ హయాంలోనూ ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడుకుంటూ వచ్చామని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రజల అవసరాలను విస్మరించి ప్రభుత్వ భూములను విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ భూముల విక్రయం ద్వారా సుమారు రూ.40 వేల కోట్ల ఆదాయం సమకూర్చుకుని ఢిల్లీకి పంపే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రస్తుత అవసరాలతో పాటు భావితరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ విలువైన స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే భూములను కాపాడుకోకపోతే రాబోయే తరాలకు ఏమి మిగులుస్తామని ప్రశ్నించారు. ఈ నెల 13వ తేదీన ట్రక్ పార్క్ స్థలం వద్ద మీడియా సమావేశం నిర్వహించి, స్థలాన్ని విక్రయించకుండా కాపాడాలని ప్రభుత్వానికి ప్రజల తరపున విజ్ఞప్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి, మూసాపేట నివాసితుల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అసమాన ప్రతిభాశాలి వెంకటసుబ్బన్న

నేడు అవధాన పితామహ సీవీ సుబ్బన్న జయంతి

కడప వెంకటసుబ్బన్న. తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభాశాలి. అవధాన ప్రక్రియలో అందె వేసిన చేయి. సహస్రాధిక అవధాన కార్యక్రమ నిర్వహణా దురందరులు. అవధానాలు మాత్రమే కాక, పురాణ ప్రబందా లను అలవోకగా రచించిన సవ్యసాచి. సీవీ సుబ్బన్న.(కడప వెంకట సుబ్బన్న) అద్భుతమైన ప్రతిభ, అనన్య సామాన్యమైన వ్యుత్పత్తి, అసాధారణమైన అభ్యాసం కలిగిన శతావధాని. వర్ణన, సమస్యా పూరణం, వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి, నిషేధాక్షరి మొదలైనా ఏ అంశాన్నయినా అలవోకగా నిర్వహించగలిగిన సరస్వ తీ పుత్రుడు. వెయ్యికి పైగా అవధానాలు నిర్వహించిన ఘనత ఆయనదే. సుబ్బన్న కడప జిల్లా ప్రొద్దుటూరులో నవంబరు 12, 1929న కడప రంగమ్మ చెన్నప్ప దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య ప్రొద్దుటూరులో, సెకండరీ విద్య అనీబిసెంట్ మునిసిపల్ హైస్కూలులో, ఇంటర్మీడియట్ మదనపల్లి అనీబిసెంట్ కళాశాలలో జరిగింది. తరువాత డిగ్రీ, ఎంఎ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి పూర్తి చేశారు. కె.సుబ్బ రామప్ప పర్య వేక్షణలో "అవధాన విద్య" అనే విషయంపై పరిశోధనచేసి మైసూరు విశ్వ విద్యాలయం నుండి 1981లో పిహెచ్‌డి పట్టాను పొందారు. అదే సంవత్సరం అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేటుతో ఆయనను సత్కరించారు. ఆంధ్ర దేశాన్ని అవధానాలతో ఉర్రూతలూపి, పద్యాన్ని పశువుల కాపరి దాకా తీసుకుపోయిన తిరుపతి వేంకట కవులు గ్రంథాలు రచించి తమ పద్యా విద్యా ప్రతిభను ప్రదర్శించినట్లే, సీవీ సుబ్బన్న శతావధాని కూడా శతానేక అవధానాలు చేసి పదికి పైగా పద్య గ్రంథాలు రచించారు. సుబ్బన్న అనేక ప్రాంతాల్లో చేసిన అవధానాల్ని క్రోడీకరించి మూడు సంపు టాలుగా ముద్రించారు. ఆముడింటిని కలిపి శతావధాన ప్రబంధం త్రిపుటిః పేరుతో బృహద్గ్రంథాన్ని ప్రచురించారు. శ్రీ భద్రాచల రామదాస ప్రబంధం, దివ్య లోచన ప్రబంధం (ధనుర్దాసు) భోజ కువింద చరిత్రము, గోపవధూ కైవల్యము, త్రివేణి, దుర్భిక్షము, పల్లె పదాలు, కళావాహిని, తీయని త్రోవ, నైవేద్యము, అష్టావక్రుడు, పురందర దాసు, కుంతి, చెంచులక్ష్మి (నాటకం), శ్రీ వీరాంజనేయ శతకం, శ్రీకృష్ణ శతకం, శ్రీ రామలింగేశ్వర శతకం, శ్రీ వేంకటేశ్వర శతకం అనే గ్రంథాల్ని రచించి ప్రచురించారు. అవధాన విద్యను గూర్చి ఆయన రచించిన సిద్ధాంత గ్రంథాన్ని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు ముద్రించారు. 'శ్రీవ్యాసవిలాస ప్రబంధము'ను సీవీ సుబ్బన్న 2004లో మొదటి ముద్రణగా వెలువరించారు. తర్వాతి సంవత్సరమే ఇది రెండవ ముద్రణకు నోచుకొని, అశేష ప్రజాదరణ పొందింది. అష్టాదశ పురాణాల రచనయే గాకుండా పంచ మ వేదమైన భారత రచనకు నడుం బిగించి, మహావిష్ణువు అవతారమైన వ్యాసుని జీవిత పూర్వాపరాలను ప్రబంధంగా రచించడం ద్వారా ప్రతిభ తేట తెల్ల మయింది. శ్రీ వ్యాస విలాస ప్రబంధము'లో ఏడు ఆశ్వాసాలలో... ప్రతి ఆశ్వాసం లోనూ కథను సక్రమంగా నడిపించటానికి, ఆయా సన్నివేశాలకు ప్రత్యేక శీర్షికలుంచటం, అరుంధతీ పాణి గ్రహణం తో ప్రథమాశ్వాసం ప్రారంభమై, తర్వాత పరాశర జననం, వసురాజు, శుక్తిమతి మత్స్య గంధి వృత్తాంతాలు, సద్యోగర్భంలో వ్యాసుడు మత్స్యగంధికి పరాశరునికి జన్మించటం, శంతనుడు గాంగేయుని భీష్మ ప్రతిజ్ఞ తదితర అంశాలను మూలాన్ని విభేదించకుండా రాయడం అద్భుత రచనా సృష్టికి, సామర్థ్యానికి తార్కాణం. 2007లో ప్రథమ ముద్రణగా వెలువరించిన ప్రబంధం 'భద్రాచల శ్రీరామదాస ప్రబంధము', భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి పొందిన కంచెర్ల గోపన్న జీవిత చరిత్రను, ఆనాటి చారిత్రక విశేషాలను పద్య ప్రబంధంగా సుబ్బన్న రచించారు. సంస్కృత సమాస భూయిష్టంగా పద్యాన్ని ఎలా కూర్చా రో, తేట తెలుగు పదాలతో పద్యాన్ని అలాగే భావం, విషయం, పటుత్వం తగ్గకుండా జేయగలిగిన గొప్ప ప్రతిభాశాలి సుబ్బన్న. మొదటి అవధానం ప్రొద్దుటూరులో 1950వ సంవత్సరంలో శివరాత్రి పర్వదినం నాడు చేశారు. చివరి అవధానం 1997లో ఫిబ్రవరి 25వ తేదీన పేరాలలో చేశారు. ఈ మధ్య కాలంలో అంటే 47 సంవత్సరాల పాటు వెయ్యికి పైగా అష్ట, శతావ ధానాలు చేశారు. భారత దేశ మంతా తిరిగి అవధాన ప్రతిభా సామర్థ్యాన్ని నిరూపించు కొన్నారు. షష్టిపూర్తి తర్వాత కూడా ధారణ తగ్గకుండా అవధానాలు చేసి అందరి మెప్పులు పొందిన సరస్వతీ పుత్రులు సుబ్బన్న శతావధాని. సాహిత్య రంగంలో లబ్ధప్రతిష్ఠులైన దేవులపల్లి కృష్ణ శాస్త్రి, చెలమచెర్ల రంగాచార్యులు, కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, డా.దివాకర్ల వేంకటా వధాని, వెంపరాల సూర్య నారాయణ శాస్త్రి , గంటిజోగి సోమయాజి, దీపాల పిచ్చయ్య శాస్త్రి, మధునా పంతుల సత్య నారాయణ శాస్త్రి , డా.పుట్టపర్తి నారాయణాచార్యులు, దాశరథి, డా.సి.నారాయణరెడ్డి, ఆరుద్ర వంటి వారెందరో సుబ్బయ్య అవధానాలలో పృచ్ఛకులుగా వ్యవహరించిన గొప్పతనాన్ని మూట కట్టుకున్నారు. ప్రబంధ రచనలో, కవిత్వ పటుత్వ సంపదలో సాటిలేని మేటిగా పేరెన్నిక గన్నారు. పద్యానికి కాలం చెల్లిందను కొంటున్న కాలంలో, పెద్ద కావ్యాలకు ఆదరణ కరువు అవుతున్నది అనుకునే సమయంలో ఛందోబద్ధంగా అద్భుత ప్రబంధాల్ని రచించి సహృదయ పాఠకుల, శ్రోతల మన్ననలను పొందిన సి.వి.సుబ్బన్న శతావధాని ప్రజ్ఞ అనన్య సామాన్యం. అవధాన ప్రక్రియను తిరుపతి వేంకట కవులు కొప్పరపు సోదరుల తర్వాత విశేషంగా వ్యాప్తి చేసిన సాహితీవేత్తగా సుబ్బన్నకు పేరుంది. 1964లో గుర్రం జాషువా అధ్యక్షతన ఆయనకు భట్టిప్రోలులో కనకాభిషేకము, గజారోహణ మహోత్సవం జరిగింది. ఆయనకు పది పర్యాయాలు కనకాభిషేకం జరిగింది. 1965లో దీపాల పిచ్చ య్య శాస్త్రి అధ్యక్షతన బెజవాడ గోపాల రెడ్డిచే అవధాని ఎడమ కాలికి గండ పెండేరము తొడగ బడింది. 1981లో శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం వారిచే గౌరవ డాక్టరేటు పొందారు. అనేక సన్మానాలు, సత్కారాలు పొందారు. విశాఖలోని లోక్ నాయక్ ఫౌండేషన్ అందించే విశిష్ట పురస్కారం, మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరి యంలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా పురస్కార గ్రహీతగా నిలిచారు. సరస్వతీ పుత్ర, అవధాని పితామహ బిరుదులు పొందారు. సుబ్బయ్య మార్చి 5, 2017న హైదరాబాదులో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాసను విడిచారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494


ఊపిరిని కబళించే న్యూమోనియా..

నేడు ప్రపంచ న్యూమోనియా అవగాహన దినోత్సవం



- అప్రమత్తతే ఆయుధం!
- చిన్నారులు, వృద్ధులకు పొంచి ఉన్న శ్వాసకోశ ముప్పు
- సాధారణ దగ్గు, జ్వరమే కదా అని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం
- సకాలంలో గుర్తింపు.. సరైన చికిత్సతో ప్రాణాలకు రక్షణ
- టీకాలు, పరిశుభ్రత, పోషకాహారంతో వ్యాధికి అడ్డుకట్ట
- ప్రతి ఒక్కరికీ న్యూమోనియాపై అవగాహన అవసరమంటున్న వైద్య నిపుణులు

ప్రతి సంవత్సరం నవంబర్ 12న ప్రపంచ న్యూ మోనియా అవగాహన దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ రోజు ప్రధానంగా ప్రజల కు న్యూమోనియా అనే తీవ్రమైన వ్యాధి గురించి అవగాహన పెంచడం, దీని ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు తీసు కోవడం, దీని నిరోధానికి, చికిత్సకు సంబంధించిన సమా చారాన్ని అందించడమే లక్ష్యంగా జరుపుకుంటారు. ఈ కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్, గ్లోబల్ కోలిషన్ అగైన్స్ట్ చైల్డ్ న్యూమోనియావంటి అనేక అంతర్జా తీయ సంస్థలు నిర్వహిస్తాయి. ఈ దినోత్సవం వల్ల ప్రజ లు న్యూమోనియాను తీవ్రమైన వ్యాధిగా గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రోత్సహిస్తారు. న్యూమోనియా ఒక తీవ్రమైన శ్వాసకోశ రుగ్మత. ఇది వైరస్, బ్యాక్టీరియా లేదా ఫంగస్ వంటి సూక్ష్మ క్రిముల ద్వారా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా ఊపిరితిత్తులలోని వాయు కుహరాలను(అల్వియోలి) ద్రవంతో నింపడం వల్ల శరీరానికి అవసరమైన ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుంది. ఫలితంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది, దీని ప్రభా వం తీవ్రమై ప్రాణాంతకంగా మారవచ్చు. న్యూమోనియా ప్రపంచవ్యాప్తంగా అన్ని వయస్సుల వారిని ప్రభావితం చేయగలదు, అయితే ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, అణు రోగులు ఎక్కువగా ఈ వ్యాధికి గురవుతున్నారు. న్యూమోనియాతో ప్రతి సంవత్సరం లక్షల మంది చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో చిన్నారుల్లో మరణాలకు న్యూమోనియా ప్రధాన కారణంగా మారింది. పేదరికం, తక్కువ రోగ నిరోధక శక్తి, ఆరోగ్య సేవలు సరిగ్గా అందుబాటులో లేకపోవడం ఈ వ్యాధి వ్యాప్తిని మరింతగా పెంచుతాయి. న్యూమోనియాను పలు లక్షణాల ద్వారా గుర్తించ వచ్చు. ఉబ్బసం-ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది కలగడం, దగ్గు-కొన్నిసార్లు ముక్కులో లేదా నోటిలో నుండి మాడిన లేదా చిక్కటి ద్రవం రావడం. అధిక జ్వరం-శరీర ఉష్ణోగ్ర త పెరగడం, శరీరంలో వాపు-ముఖ్యంగా ముఖం లేదా చేతులు, కాళ్లలో వాపు ఏర్పడటం, అలసట-శరీరం నిస్సత్తు వగా అనిపించడం. ఈ లక్షణాలు కనిపించినప్పుడు వాంఛనీ యంగా వైద్యుని సలహా తీసుకోవడం అవసరం. ముఖ్యంగా చిన్నారుల, వృద్ధుల విషయంలో వెంటనే వైద్య సలహా పొందడం కీలకం. న్యూమోనియాను నివారించేందుకు పలు చర్యలు తీసుకోవచ్చు.టీకాలు-న్యూమోనియాను నిరోధించేందుకు బహుళరకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పీసీవీ (పైనియోకాకల్ కన్యూగేట్ వ్యాక్సిన్), హెచ్ఐబీ వ్యాక్సిన్ వంటి టీకాలు ముఖ్యమైనవి. పిల్లలకు, వృద్ధులకు ఈ టీకాలు తప్పనిసరిగా అందించడం ద్వారా వ్యాధి వ్యా ప్తిని తగ్గించవచ్చు. స్వచ్ఛత పాటించడం- మంచి పరిశుభ్రత పాటించడం ద్వారా న్యూమోనియాను నిరోధించవచ్చు. చేతులు కడుక్కోవడం, తక్కువగా రక్షణ కలిగిన స్థలాల్లో బ యటకు వెళ్ళకపోవడం వంటి చర్యలు తీసుకోవాలి. సక్రమ మైన పోషకాహారం-శరీరానికి అవసరమైన పోషకాహారాన్ని అందించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది, ఇది శరీరానికి న్యూమోనియాను ఎదుర్కోవడంలో తోడ్పడుతుంది. మందులు - వ్యాధి తీవ్రతను బట్టి డాక్టర్ సూచించిన యాంటీబయాటిక్స్ లేదా యాంటీ వైరల్ మందులను వాడటం అవసరం. ప్రపంచ న్యూమోనియా అవగాహన దినోత్సవం ఉద్దేశ్యం ప్రజలకు ఈ వ్యాధి తీవ్రత, నిరోధకత మరియు చికిత్సా మార్గాలపై అవగాహన కల్పించడం.ఈ సందర్భంగా వివిధ శిక్షణా కార్యక్రమాలు, టీకాల పై అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలలో జాగ్రత్తలు తీసుకునే అలవాటు పెంచడం జరిగింది. ప్రపంచ న్యూమోనియా అవగాహన దినోత్సవం సందర్భంగా, న్యూమోనియాను వ్యాపించకుండా నిరోధించడానికి మన సమాజం, ప్రభుత్వాలు, ఆరోగ్య సంస్థలు కలిసి పని చేయడం అత్యంత అవసరం. ప్రతి ఒక్కరూ న్యూమోనియా గురించిన పూర్తి అవగాహన కలిగి ఉండి ఈ వ్యాధిని ముందుగా నిరోధించేందుకు, చికిత్సా పద్ధతులు పొందేందుకు శ్రద్ధ తీసుకోవాలి.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

స్వార్థమే పరమార్థం.. కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం!

నేడు జాతీయ కుటుంబ సౌహార్ద్ర దినోత్సవం

కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్నవారు. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. "రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు కుటుంబ సమైక్యత, సంఘటితం గురించి ప్రజలందరికీ అవగాహన కలిగించడం, జాతీయ అంతర్జా తీయ స్థాయిలో సుస్థిర కుటుంబాలకు దోహదం చేయడం, నైపుణ్యాన్నీ, అనుభవాలను, సామాజిక విలువలను పరస్పరం పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సమాచారాన్ని, సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి లక్ష్యాలతో నవంబర్ 12ను జాతీయ కుటుంబ సౌహార్ద్ర దినోత్సవంగా జరుపు కుంటారు.



భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరి ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగాయ నడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉ మ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అందరిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉండే వంటే ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదండ్రులు, అత్త మామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మరదళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్రతో కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదల నిలయాలు. పిల్లలు చిన్న వయస్సులో ఉన్నపుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించినప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబాన్ని అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉ న్నప్పటికీ ఒకరినొకరు పలుక రించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో.

విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది.

ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్ లోనో, మొబైల్ లోనో యోగ క్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉ మ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టి ల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశయోక్తి కాదు. అనేక కుటుం బాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు.

డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలక రించుకునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసు కోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీ యులు దూరం కావడం, కనీసం మనసు లోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం.

కుటుంబ దౌర్జన్యం చట్టం 498-ఎను దుర్వినియోగం చేయడం ద్వారా కొందరు భార్యలు, భర్తలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు బనాయించి వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. బోగస్ వరకట్న కేసులు బనాయించడం ద్వారా దేశవ్యాప్తంగా 57 వేల మంది పురుషులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే పురుషులు వివాహం చేసుకోవడానికి వెనుకంజ వేసే పరిస్థితి వస్తుంది. భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న విభేదాలు న్యాయస్థానం వెలుపలనే పరిష్కరించు కోవడం సముచితంగా ఉ ంటుందని నవంబరు 12 ను జాతీయ కుటుంబ సౌహార్ద్ర దినోత్సవంగా జరుపు కోవాలని నిర్ణయించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

పంజాబ్‌కు కొత్త కెప్టెన్ లేడు..

శ్రేయస్ నాయకత్వంలోనే హార్దిక్!



- పంజాబ్ కింగ్స్ సారథ్యంపై ఉత్కంఠకు తెరదించిన పాండ్యా
- రూ.18 కోట్లతో ముంబై నుంచి పంజాబ్‌కు హార్దిక్ బదిలీ అంటూ ప్రచారం
- ముంబై ఇండియన్స్‌కు అర్ష్‌దీప్ సింగ్ వెళ్లినట్లు కథనాలు
- 'నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ' అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసినట్లు సమాచారం
- కెప్టెన్సీ కోసం కాదు.. జట్టు విజయం కోసమేనంటూ హార్దిక్ సంకేతాలు?

న్యూఢిల్లీ, నవంబర్ 11 (చురకలు): ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2027 సీజన్‌కు ముందు జరిగిన భారీ ఆటగాళ్ల మార్పిడి క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి రేకెత్తించింది. ముంబై ఇండియన్స్ నుంచి స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు మారగా, పంజాబ్ జట్టు నుంచి యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరాడు. ఈ భారీ ఒప్పందాన్ని బుధవారం అధికారికంగా ప్రకటించారు. రూ.18 కోట్ల ఒప్పందంతో హార్దిక్ పంజాబ్ జట్టులో చేరాడు. అర్ష్‌దీప్ కూడా అదే మొత్తంతో ముంబై జట్టుకు మారాడు. అయితే గతంలో ముంబై ఇండియన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన హార్దిక్ పంజాబ్‌లో చేరడంతో ఆ జట్టు సారథ్య బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో హార్దిక్ తన సామాజిక మాధ్యమాల ఖాతాలో చేసిన పోస్టుతో ఊహాగానాలకు తెరదించాడు. "సత్ శ్రీ అకాల్ పంజాబ్.. నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు యావత్ పంజాబ్.. మీకు అండగా నిలుస్తాను" అంటూ పేర్కొన్నాడు. దీంతో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోనే ఆడేందుకు హార్దిక్ సిద్ధంగా ఉన్నట్లు స్పష్టమైంది. గతంలో గుజరాత్ టైటాన్స్‌కు నాయకత్వం వహించిన హార్దిక్ పాండ్యా 2022లో ఆ జట్టుకు తొలి సీజన్‌లోనే ఐపీఎల్ ట్రోఫీ అందించాడు. అనంతరం 2024లో ముంబై ఇండియన్స్‌కు తిరిగి వచ్చినప్పుడు ఐదుసార్లు జట్టును విజేతగా నిలిపిన రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఆ నిర్ణయం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా పంజాబ్‌కు మారడంతో మరోసారి కెప్టెన్సీ అంశం తెరపైకి వచ్చింది. అయితే శ్రేయస్ అయ్యర్ను తన కెప్టెన్‌గా పేర్కొంటూ హార్దిక్ చేసిన ప్రకటనతో జట్టు నాయకత్వంపై తన వైఖరిని వెల్లడించినట్లయింది. మరోవైపు ప్రధాన శిక్షకుడు రికీ పాంటింగ్‌కు కూడా హార్దిక్ పూర్తి మద్దతు ప్రకటించాడు.

పంజాబ్ బలాన్ని పెంచనున్న హార్దిక్!

శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో పంజాబ్ కింగ్స్ ఇప్పటికే ఫైనల్‌కు చేరిన అనుభవం కలిగి ఉంది. ఇప్పుడు హార్దిక్ చేరికతో జట్టుకు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అదనపు బలం చేకూరనుంది. కీలక సమయాల్లో వేగంగా పరుగులు సాధించడంతోపాటు అవసరమైనప్పుడు వికెట్లు పడగొట్టగల సామర్థ్యం హార్దిక్ సొంతం. ఐపీఎల్‌లో ఇప్పటివరకు 162 మ్యాచ్‌లు ఆడిన హార్దిక్ 2,955 పరుగులు సాధించడంతోపాటు 82 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు పంజాబ్ తరఫున 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు తీసిన అర్ష్‌దీప్ ముంబై బౌలింగ్ విభాగానికి కొత్త బలం కానున్నాడు. మొత్తానికి ఇద్దరు భారత స్టార్ ఆటగాళ్ల మార్పిడి ఐపీఎల్ 2027 సీజన్‌పై అంచనాలను పెంచింది.



సమ్రీన్ కౌర్‌తో అర్ష్‌దీప్ నిశ్చితార్థం..

వెల్లింగ్టన్, నవంబర్ 11 (చురకలు): టీమ్‌ఇండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ తన ప్రేయసి, నటి సమ్రీన్ కౌర్ తో నిశ్చితార్థం చేసుకున్నాడు. బుధవారం న్యూజిలాండ్‌లో ఆమె చేతికి ఉంగరం తొడిగి లవ్ ప్రపోజ్ చేశాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సమ్రీన్ సోషల్ మీడియాలో పంచుకుంది. "జీవితం మాకెన్నో ఇచ్చినా.. ఒకరికొకరం దొరకడమే నాకు అత్యంత ఆనందాన్నిచ్చింది. జీవితాంతం కలిసే ఉందాం" అంటూ సమ్రీన్ తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. 11.11.2026 తేదీని ప్రస్తావిస్తూ 'హాయ్ కాబోయే భర్త' అని సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది.

ఎవరీ సమ్రీన్?

జమ్మూకశ్మీర్‌కు చెందిన సమ్రీన్ నటి, మోడల్. 2018లో ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో ఫైనలిస్ట్. '83' సినిమా, 'నెయిల్ పాలిష్' వెబ్‌సిరీస్‌తో పాటు పలు పంజాబీ చిత్రాల్లో నటించింది. గురు రంధావా, బాద్‌షా, జుబిన్ నౌటియాల్ పాటల వీడియోల్లోనూ కనిపించింది. ఈ ఏడాది జులై 26న అర్ష్‌దీప్ ఆమెతో ఉన్న ఫొటోలను 'మై పర్సన్' అంటూ పంచుకోవడంతో వీరి ప్రేమ విషయం బహిర్గతమైంది. ఇటీవల న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో నాలుగు వికెట్లు తీసిన అనంతరం అర్ష్‌దీప్ ప్రత్యేకంగా డ్యాన్స్ చేస్తూ వికెట్ సంబరాలు చేసుకున్నాడు. ఆ సంబరాలు తన ప్రేయసి సమ్రీన్‌తో కలిసి చేసే డ్యాన్స్ స్టెప్పులేనని వెల్లడించాడు.

నీరజ్‌కు కాంస్యం.. భారత్‌కు ఒలింపిక్ బెర్త్!

- ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్ సత్తా
- 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో నీరజ్‌కుమార్‌కు కాంస్యం
- 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు భారత్‌కు రెండో కోటా
- వ్యక్తిగత విభాగంలో నీరజ్‌కు తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం
- జట్టు విభాగంలోనూ భారత్‌కు కాంస్యం.. ఒక్క పాయింట్‌తో చేజారిన రజతం



దోహా, నవంబర్ 11 (చురకలు): ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు మరోసారి సత్తా చాటారు. ఖతార్ రాజధాని దోహాలో జరుగుతున్న ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ నీరజ్‌కుమార్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచాడు. ఈ విజయంతో 2028లో లాస్‌ఏంజెలెస్‌లో జరగనున్న ఒలింపిక్ క్రీడలకు భారత్‌కు రెండో షూటింగ్ కోటా లభించింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 591 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన నీరజ్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. పతక పోరులోనూ నిలకడగా రాణించి 346.5 పాయింట్లతో కాంస్యాన్ని సొంతం చేసుకున్నాడు. చివరి దశలో 9.4 పాయింట్ల షాట్ కారణంగా రజత పతకం చేజారింది. ఈ విభాగంలో తటస్థ అథ్లెట్‌గా బరిలోకి దిగిన దిమిత్రి పిమెనోవ్ 362.8 పాయింట్లతో జూనియర్ ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణం సాధించగా, స్లొవేకియాకు చెందిన పాట్రిక్ జానీ 357.2 పాయింట్లతో రజతం దక్కించుకున్నాడు.

వ్యక్తిగత విభాగంలో తొలి పతకం

ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగంలో నీరజ్‌కుమార్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం. మరో భారత షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ కూడా ఫైనల్‌కు చేరుకున్నప్పటికీ 323.7 పాయింట్లతో ఐదో స్థానానికి పరిమితమయ్యాడు. నీరజ్ సాధించిన కాంస్యంతో భారత్‌కు రైఫిల్ విభాగంలో తొలి ఒలింపిక్ కోటా లభించింది. అంతకుముందు పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో జైపాల్ మాల్వియా రజత పతకం సాధించి భారత్‌కు తొలి కోటా అందించాడు. అయితే ఈ కోటాలు దేశానికి కేటాయించబడతాయి తప్ప పతకం సాధించిన క్రీడాకారుడికే ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం ఖరారైనట్లు కాదు.

జట్టు విభాగంలోనూ కాంస్య పతకం

పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ జట్టు విభాగంలోనూ భారత్ కాంస్య పతకం సాధించింది. నీరజ్‌కుమార్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, అఖిల్ షియోరన్‌లతో కూడిన భారత బృందం మొత్తం 1,751 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది. నార్వే 1,752 పాయింట్లతో రజతం దక్కించుకోగా, చెక్ రిపబ్లిక్ 1,754 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కేవలం ఒక్క పాయింట్ తేడాతో భారత్‌కు రజతం చేజారింది. వ్యక్తిగత, జట్టు విభాగాల్లో నీరజ్ సాధించిన రెండు కాంస్య పతకాలు భారత షూటింగ్ క్రీడాకారుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి.

ఇషా బృందానికి స్వర్ణం



దోహా: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో హైదరాబాదీ అమ్మాయి ఇషా సింగ్ మెరిసింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో భారత్ స్వర్ణం గెలవడంలో ఆమె కీలక పాత్ర పోషించింది. రెండు రోజుల పాటు సాగిన క్వాలిఫికేషన్ రౌండ్లో ఇషా అత్యుత్తమంగా 590 పాయింట్లు రాబట్టగా.. మను బాకర్ 587, దివ్య సుబ్బరాజు 584 పాయింట్లు సాధించారు. మొత్తంగా 1761 పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం గెలుచుకుంది. దక్షిణ కొరియా (1748) రజతం, వియత్నాం (1745) కాంస్యం చేజిక్కించుకున్నాయి. 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో ఇషా, మను ఫైనల్ చేరినా.. పతకాలు మాత్రం సాధించలేకపోయారు. ఇషా పోటీలో ఉన్న 8 మందిలో చివరి స్థానానికి పరిమితం కాగా.. మను నాలుగో స్థానంలో నిలిచి, త్రుటిలో పతకం కోల్పోయింది. యాంగ్ జిన్ (దక్షిణ కొరియా) 44 పాయింట్లతో స్వర్ణం గెలవగా.. ట్రిన్ విన్ (43, వియత్నాం) రజతం, జాంగ్ (34, చైనా) కాంస్యం సాధించారు. పతకాలు సాధించిన ముగ్గురూ 2028 ఒలింపిక్ కోటా బెర్తులను సాధించారు. భారత్ నుంచి ఈ టోర్నీలో జైపాల్ మాల్వీయ (పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్) మాత్రమే ఒలింపిక్ కోటా బెర్తు సాధించాడు.

క్రిస్ గేల్..

47 ఏళ్ల వయసులో మళ్లీ మైదానంలోకి

వెనీస్: వెస్టిండీస్ విధ్వంసక బ్యాటర్ క్రిస్ గేల్ ఆడితే ఆ ఆకర్షణే వేరు. ఒకప్పుడు ప్రపంచంలో ఎక్కడ లీగ్‌లు జరిగినా అతడు కచ్చితంగా ఉండేవాడు. కొంతకాలంగా ఆటకు దూరంగా ఉన్న అతడు మళ్లీ లీగ్ బాట పట్టాడు. 47 ఏళ్ల వయసులో ఇటాలియా టీ10 లీగ్‌లో ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఈ లీగ్‌లో వెనిస్ లైవ్‌వైర్స్‌కు అతడు ప్రాతినిధ్యం వహించనున్నాడు. "టీ10 ఫార్మాట్ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇటలీ అభిమానులను అలరించడానికి సిద్ధంగా ఉన్నా" అని గేల్ చెప్పాడు. "గేల్ అనుభవం, ఆటపై అతడికున్న అవగాహన.. వెనిస్ జట్టుకు ఎంతో ఉపయోగపడనుంది. గేల్‌కు స్వాగతం" అని ఆ జట్టు డైరెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ తెలిపాడు. నవంబర్ 18 నుంచి ఇటాలియా లీగ్ ఆరంభం కానుంది.





‘గోట్’ ప్రీ రిలీజ్ ఈవెంట్..

దివ్య భారతి హైలైట్!

ప్రీ రిలీజ్ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అందాల తార

హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా నటించిన ‘గోట్’ చిత్రం విడుదలకు సిద్ధమైంది. గురువారం ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయిక దివ్యభారతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన అందమైన వస్త్రధారణ, ఆకర్షణీయమైన రూపంతో వేడుకలో అందరి దృష్టిని ఆకట్టుకుంది. నక్షత్రాల కంటే ఎక్కువగా మెరిసిపోతూ కనిపించిన దివ్యభారతి ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణగా మారింది. చిత్ర విడుదలకు ముందు నిర్వహించిన వేడుకలో దివ్యభారతి తన ప్రత్యేకమైన శైలితో ఆకట్టుకుంది. అందంగా ముస్తాబై కార్యక్రమానికి హాజరైన ఆమె ఆహూతుల దృష్టిని ఆకర్షించింది. వేడుకలో ఆమె సందడి ప్రత్యేకంగా నిలిచింది. కథానాయికగా తెరపై అలరించేందుకు సిద్ధమవుతున్న దివ్యభారతి ప్రీ రిలీజ్ కార్యక్రమంలోనూ తన ప్రత్యేకతను చాటుకుంది. సుడిగాలి సుధీర్ ప్రధాన పాత్రలో నటించిన ‘గోట్’ చిత్రం గురువారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమం చిత్ర ప్రచారంలో భాగంగా జరిగింది. సినిమా విడుదలకు ముందు చిత్రబృందం నిర్వహించిన ఈ వేడుకలో దివ్యభారతి ప్రత్యేక ఆకర్షణగా నిలవడం విశేషం. సినిమా విడుదలకు ముందు కథానాయకులు, కథానాయికలు పాల్గొనే ప్రచార కార్యక్రమాలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతుంటాయి. తాజాగా ‘గోట్’ ప్రీ రిలీజ్ వేడుకలోనూ దివ్యభారతి తన ఆకర్షణీయమైన రూపంతో సందడి చేసింది. ఒకవైపు సుడిగాలి సుధీర్ కొత్త చిత్రం విడుదలపై ఆసక్తి నెలకొనగా, మరోవైపు వేడుకలో దివ్యభారతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురువారం విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.





ముందుంది అసలు సినిమా..

పవన్ కల్యాణ్ విడాకుల వేళ పూనమ్ కౌర్ ట్వీట్ కలకలం!

హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): టాలీవుడ్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఏ చిన్న వార్త బయటకు వచ్చినా, దాని వెనుక నటి పూనమ్ కౌర్ స్పందన ఎలా ఉంటుందోనని నెటిజన్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. గత కొన్నేళ్లుగా పవన్ కల్యాణ్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లను టార్గెట్ చేస్తూ ఆమె సోషల్ మీడియా వేదికగా వేస్తున్న పరోక్ష బాణాలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా లెజినోవా పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు వార్తలు బయటకు వచ్చిన తరుణంలో.. పూనమ్ కౌర్ చేసిన ఒక మిస్టరీ కామెంట్ ఇప్పుడు సినీ, రాజకీయ ఇండస్ట్రీలో పెను దుమారం రేపుతోంది. పవన్ కల్యాణ్‌కు, తనకు మధ్య త్రివిక్రమ్ అడ్డుగోడలా నిలిచారని, పవన్ చుట్టూ ఒక కోట కట్టి తనను ఆ దరిదాపుల్లోకి రాకుండా చేశారనేది పూనమ్ కౌర్ ఎప్పటి నుంచో చేస్తున్న ప్రధాన ఆరోపణ. అసలు వీరి ముగ్గురి మధ్య ఏం జరిగింది, త్రివిక్రమ్ ఇందులో ఎలాంటి పాత్ర పోషించారనే విషయాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పష్టత లేదు. పూనమ్ కూడా ఎప్పుడూ పూర్తి వివరాలను నేరుగా బయటపెట్టకుండా, ఒక్కోసారి పేర్లు ప్రస్తావిస్తూ, మరోసారి పరోక్షంగా చురకలు అంటిస్తూ తన అసహనాన్ని వెళ్లగక్కుతూనే ఉన్నారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్, అన్నా లెజినోవా విడాకుల వ్యవహారం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నడుస్తున్న వేళ, ఒక నెటిజన్ పూనమ్ కౌర్ పాత పోస్టును తవ్వి తీశాడు. “మీరు చెప్పింది నూటికి నూరుపాళ్లు నిజం” అంటూ ఆమెకు మద్దతుగా ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా ఒక కామెంట్ పెట్టాడు. దీనికి పూనమ్ ఇచ్చిన రిప్లై ఇప్పుడు టాలీవుడ్ వర్గాలను తీవ్ర ఆలోచనలో పడేసింది. ఆ నెటిజన్ కామెంట్‌కు స్పందిస్తూ.. “భవిష్యత్తులో నిజం మరింత గెలిచి తీరుతుంది. ప్రతి ఒక్కరికీ మనశ్శాంతి, సమస్యల నుంచి పరిపూర్ణ పరిష్కారం లభించాలని కోరుకుంటున్నాను” అంటూ పూనమ్ కౌర్ మరో క్రిప్టిక్ పోస్ట్ చేశారు.

ఇన్నాళ్లూ దాచిన రహస్యాలు బయటపడతాయా?

ఈ ట్వీట్‌లో ఆమె ఎక్కడా పవన్ కల్యాణ్ పేరును గానీ, ఆయన విడాకుల ప్రస్తావనను గానీ నేరుగా తీసుకురాలేదు. కానీ, సరిగ్గా పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితంలో ఇంతటి కీలక పరిణామం జరిగిన వెంటనే “ముందు ముందు మరిన్ని నిజాలు బయటకు వస్తాయి” అని ఆమె వ్యాఖ్యానించడం ఖచ్చితంగా పవన్‌ను ఉద్దేశించేనని నెటిజన్లు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ఇన్నాళ్లూ గుప్పిట్లో దాచిన ఆ రహస్యాలను పూనమ్ కౌర్ భవిష్యత్తులో ఎప్పుడు బయటపెడుతుందో, ఇంకెన్ని సంచలనాలకు తెరతీస్తుందో చూడాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

‘దరిద్రం వెంటపడితే అంతే!’

ది ప్యారడైజ్ టీమ్‌పై బాబు మోహన్ షాకింగ్ కామెంట్స్!



హైదరాబాద్, నవంబర్ 11 (చురకలు): సీనియర్ కమెడియన్ బాబు మోహన్ చేసిన కొన్ని సంచలన కామెంట్స్ ఇప్పుడు టాలీవుడ్ సర్కిల్స్‌తో పాటు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇటీవల విడుదలై నిరాశపరిచిన ‘ది ప్యారడైజ్’ సినిమా మేకర్స్ తనను అవమానించిన తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. “నాకు ప్రత్యేకంగా లుక్ టెస్ట్ చేసి, గెటప్ కూడా వేసి, తీరా షూటింగ్ సమయానికి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా నన్ను పక్కన పెట్టేశారు. చివరికి వాళ్లకు దరిద్రం, శని వెంటపడి సినిమా బాక్సాఫీస్ వద్ద అట్టర్ ఫ్లాప్ అయ్యింది” అంటూ బాబు మోహన్ చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై ఒక ఇంటర్వ్యూలో బాబు మోహన్ పూర్తి వివరాలు వెల్లడిస్తూ.. ఈ చిత్రంలో ఒక మంచి ప్రాధాన్యత ఉన్న పాత్ర కోసం చిత్ర యూనిట్ మొదట నన్ను సంప్రదించింది. ఆ తర్వాత స్వయంగా లుక్ టెస్ట్ నిర్వహించి, గెటప్ కూడా ఫైనల్ చేశారు. ఆ సమయంలో నా గెటప్ చాలా బాగుందని పొగిడి, షూటింగ్ మొదలయ్యాక కచ్చితంగా పిలుస్తామని చెప్పారు. కానీ ఆ తర్వాత అటువైపు నుంచి ఎలాంటి సమాచారం లేదు. పిలుపు వస్తుందని నేను ఎదురుచూస్తుంటే, సినిమా షూటింగ్ మొత్తం పూర్తి చేసుకుని నేరుగా థియేటర్లలోకి వచ్చేసిందని అసలు విషయాన్ని చెప్పారు. ఈ అనుభవంపై బాబు మోహన్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ.. “బహుశా నేను వాళ్లకు పనికిరాను అనుకున్నారేమో. చలనచిత్ర పరిశ్రమలో నన్ను లక్కీ హ్యాండ్‌గా భావించే దర్శకులు ఎందరో ఉన్నారు. గతంలో ఈవీవీ సత్యనారాయణ గారు ‘చెవిలో పువ్వు’ అని ఒక సినిమా తీశారు, అందులో బాబు మోహన్ లేడు, ఆ సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఆ తర్వాత ఆయన తీసిన ‘ప్రేమ ఖైదీ’లో బాబు మోహన్ ఉన్నాడు, అది ఇండస్ట్రీ బ్లాక్‌బస్టర్ అయ్యింది. అలాంటిది నన్ను ప్రత్యేకంగా పిలిచి అవమానించి పక్కన పెట్టేసరికి, వాళ్లకు దరిద్రం వెంటాడింది. ఆ శని వల్లే ఆ సినిమా ఒక్క రోజు కూడా సరిగ్గా ఆడకుండా డిజాస్టర్ అయ్యింది” అని స్పష్టం చేశారు. దశాబ్దాల సినీ అనుభవం ఉన్న ఒక సీనియర్ నటుడిని పిలిపించి, లుక్ టెస్టులు చేసిన తర్వాత, ఒకవేళ పాత్రలో ఏదైనా మార్పు ఉంటే కనీసం ఫోన్ చేసి చెప్పే కనీస సంస్కారం కూడా సదరు దర్శకనిర్మాతలకు లేకపోవడం విచారకరమని ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం బాబు మోహన్ చేసిన ఈ సెన్సేషనల్ వ్యాఖ్యల వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

‘రామాయణ’ సినిమాకు రివ్యూ ఇచ్చిన గౌతమ్ ఘట్టమనేని..



సూపర్‌స్టార్ మహేష్ బాబు తనయుడు గౌతమ్ ఘట్టమనేని తాజాగా ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్’ సినిమాపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ప్రముఖ మూవీ రేటింగ్ ప్లాట్‌ఫారమ్ ‘లెటర్‌బాక్స్డ్’ వేదికగా ఈ భారీ పౌరాణిక చిత్రంపై ఆయన స్పందిస్తూ ఏకంగా 4.5 రేటింగ్ ఇవ్వడం ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా వైరల్‌గా మారింది. ఈ సినిమా చూశాక నా మనసు పూర్తిగా కరిగిపోయింది, మాటలు రావడం లేదు. ఇందులో సీజీఐ, స్క్రిప్ట్, డైరెక్షన్ మరియు నటన అన్నీ అత్యద్భుతంగా ఉన్నాయి. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ ఎప్పటిలాగే అద్భుతమైన నటన కనబరిచారు. అయితే, రావణాసురుడి పాత్రలో యష్ నటన మాత్రం నన్ను విపరీతంగా ఆకట్టుకుంది. ఆయన నటన అసాధారణం, అద్భుతం అంతే! ప్రతి ఒక్కరూ కచ్చితంగా చూడాల్సిన సినిమా ఇది. భారతీయ సినిమా సత్తా ఏంటో చాటిచెప్పే ఒక నిజమైన నిదర్శనం ఈ చిత్రం అని గౌతమ్ తన రివ్యూలో కొనియాడారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, రాకింగ్ స్టార్ యష్ రావణాసురుడిగా నటిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రంపై స్టార్ హీరో కొడుకు ఇచ్చిన ఈ రేటింగ్, సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలను మరింత పెంచేసింది.

ఆస్కార్ రేసులో మరో భారతీయ చిత్రం

ఇండిపెండెంట్ రూట్‌లో ప్రయాణిస్తున్న ‘పైర్’!



ప్రఖ్యాత జాతీయ అవార్డు గ్రహీత, దర్శకుడు వినోద్ కప్రి తెరకెక్కించిన ‘పైర్’ సినిమా ఆస్కార్ బరిలో నిలిచింది. ఎలాంటి పెద్ద బ్యానర్లు లేకుండా, పూర్తిగా స్వతంత్ర పద్ధతిలో ఈ చిత్రాన్ని 99వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) జనరల్ ఎంట్రీ విభాగాల కోసం పంపినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. చిన్న చిత్రాలు కూడా తమ ప్రతిభ ఆధారంగా నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడాలనే నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వినోద్ కప్రి తెలిపారు. హిమాలయ ప్రాంతాల నేపథ్యంలో సాగే ఈ హృదయ విదారక కథా చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు అందుకోవడం విశేషం.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com